RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైలీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18 | సంచిక : 94 | Vol : 18 | Issue : 94

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, శుక్రవారం 5 జూన్ 2026
Karimnagar, Friday 5 June 2026

పేజీలు : 08 | వెల రూ : 4-00 | Pages : 08 | Price : 4-00



WANTED

పీపుల్స్‌డైలీ దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859

# ప్రభుత్వం తర్జనభర్జన

- మద్యం ధరల పెంపుపై సంప్రదింపులు
- పెంపు మాత్రం ఖాయమే...
- ఎదురవుతున్న పలు సవాళ్లు
- లోటుపాట్లపై అధిగమించేలా కసరత్తు



పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం ధరల సవరణపై అధ్యయనం చేయడానికి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ అధ్యక్షతన ఏర్పాటైన త్రిసభ్య కమిటీ బుధవారం నుండి మూడు రోజుల సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. ఈ కమిటీలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, చార్టర్డ్ అకౌంటెంట్ నవీన్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. మద్యం కొనుగోలు ధరల పెంపు నిర్ణయం ఇప్పుడు ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖకు పెద్ద సవాల్‌గా మారింది. ఒకవైపు మద్యం కంపెనీల నుంచి వస్తున్న ధరల పెంపు ఒత్తిడి, మరోవైపు ధరలు పెంచితే పొరుగు రాష్ట్రం నుండి ముంచుకొచ్చే అక్రమ మద్యం స్మగ్లింగ్ ముప్పు.. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించేందుకు ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. బుధవారం జరిగిన విచారణలో మద్యం తయారీ కంపెనీల ప్రతినిధులు కమిటీ ముందు హాజరై తమ నివేదికలను సమర్పించారు. (మిగతా 2లో...)

# శరవేగంగా..



- ఎయిర్‌పోర్టును తలపించేలా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నిర్మాణం
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో పునరాభివృద్ధి
- త్వరలోనే అందుబాటులోకి రైల్వే స్టేషన్

పీపుల్స్‌డైరీ–సికింద్రాబాద్ : ప్రయాణికులకు ఆకర్షణీయమైన, సకల సౌకర్యాలతో కూడిన ప్రయాణ అనుభూతిని అందించేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రపంచస్థాయి ప్రమాణాలతో రెడీ అవుతోంది. దక్షిణ మధ్య రైల్వే అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పునరాభివృద్ధి పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పురోగతి ఫోటోలు, వివరాలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి బుధవారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కేవలం ఒక రవాణా కేంద్రంగానే కాకుండా.. భవిష్యత్ అవసరాలను తీర్చే ఒక భారీ అంతర్జాతీయ హబ్‌గా మారుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఆధునిక రైల్వే గేట్‌వే తెలంగాణ ప్రగతికి ప్రతిరూపమన్నారు. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో భాగమే (మిగతా 2లో...)

# మమత మనుగడ కష్టమేనా?

- దీదీకి కోలుకోలేని ఎదురుదెబ్బ..
- బీజేపీతో టచ్‌లోకి 20 మంది ఎంపీలు?
- ఎమ్మెల్యేలు తిరుగుబాటుతో ఒత్తిడిలోకి మమతా బెనర్జీ
- పార్టీ ఫిరాయింపులకు వ్యూహరచన చేస్తోన్న ఎంపీలు
- శివసేన, ఎన్సీపీ మాదిరి సంక్షోభంలో తృణమూల్

పీపుల్స్‌డైరీ–కోల్‌కత్తా : అసెంబ్లీలో తృణమూల్ కాంగ్రెస్‌ను కుదిపేసిన సంక్షోభం.. పార్లమెంటులోనూ మమతా బెనర్జీ పార్టీని ముంచేయబోతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. కనీసం 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నారని, పార్టీ ఫిరాయింపునకు ప్రణాళికలు రచిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం అత్యున్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, పార్టీ మారడానికి ఎంపీలు ఆసక్తి చూపుతున్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం పార్లమెంట్‌లో టీఎంసీకి లోక్‌సభలో 28, రాజ్యసభలో 13 మంది కలిపి మొత్తం 41 మంది ఎంపీలు ఉన్నారు.

ఒకవేళ ఈ ప్రచారమే నిజమైతే, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇప్పటికే తిరుగుబాటుతో సతమతమవుతున్న మమతా బెనర్జీకి ఇది కోలుకోలేని పెద్ద దెబ్బ అవుతుంది. ప్రతిపక్ష కూటమిలో ఎంపీల సంఖ్యాపరంగా తృణమూల్ కాంగ్రెస్ రెండో అతిపెద్ద శక్తిగా ఉంది. అలాంటిది పార్టీలో చీలిక వస్తే, అటు టీఎంసీతో పాటు ఇటు ప్రతిపక్షాల (మిగతా 2లో...)



# పుణ్యక్షేత్రంలో కామాంధులు...

## అరుణాచలంలో ఇద్దరిపై గ్యాంగ్ రేప్!

పీపుల్స్‌డైరీ–తిరువణ్ణామలై : తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం తిరువణ్ణామలై (అరుణాచలం)లో వరుసగా వెలుగులోకి వచ్చిన రెండు సామూహిక అత్యాచార ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. లక్షలాది మంది భక్తులు పవిత్రంగా భావించే గిరి ప్రదక్షిణ మార్గంలోనే ఈ దారుణాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మహిళలపై అత్యాచారం చేయడమే కాకుండా, వారి నగ్న వీడియోలు చిత్రీకరించి డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేసిన ఘటనలు భక్తుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ రెండు కేసుల్లో మొత్తం 11 మంది నిందితులను పోలీసులు గుర్తించగా, ఇప్పటివరకు 8 మందిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉండటంతో వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ వ్యవహారం తమిళనాడులోనే కాకుండా దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**గిరి ప్రదక్షిణకు వచ్చిన వివాహితపై దారుణం..**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ధర్మపురి జిల్లాకు చెందిన ఓ వివాహిత గత నెల 30న తన స్నేహితులతో కలిసి పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు వచ్చింది. గిరి ప్రదక్షిణ పూర్తి చేసిన అనంతరం ఆమె ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం అవుతోంది. ఈ క్రమంలో పెద్దకోలాపాడి ప్రాంతం వద్ద ఆమె, తనతో వచ్చిన ఓ స్నేహితుడు మాట్లాడుకుంటూ ఉండగా, ఆయుధాలతో వచ్చిన కొందరు వ్యక్తులు వారిని అడ్డగించారు. (మిగతా 2లో...)



# అల్లాడిన హైదరాబాద్

- భాగ్యనగర చరిత్రలో ఈసారి ఘోరమైన వేసవి
- అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్
- ఏకంగా 47 రోజుల పాటు 40 డిగ్రీల కంటే ఎక్కువగా నమోదు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వాతావరణ నిపుణులు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : హైదరాబాద్ వాసులకు ఈ ఏడాది వేసవి కాలం ఒక సాధారణ సీజన్‌లా కాకుండా.. 'అగ్ని'పరీక్షలా సాగింది. పగటిపూట నిప్పులు చెరిగే ఎండలు, రాత్రి వేళల్లో ఉపశమనం లేని ఉక్కపోతతో నగరం అల్లాడిపోయింది. అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం హైదరాబాద్‌ను నిప్పుల కొలిమిలా మార్చేసింది. ఫలితంగా గత దశాబ్ద కాలంలోనే అత్యంత ఉష్ణోగ్రతలు కలిగిన వేసవిగా 2026 నమోదైంది. వాతావరణ గణాంకాలను పరిశీలిస్తే 2026 వేసవి ఎంత భయంకరంగా సాగిందో అర్థమవుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి జూన్ 1 మధ్య కాలంలో నగరంలో ఏకంగా 47 రోజుల పాటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ కంటే (మిగతా 2లో...)

# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం..

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : హైదరాబాద్ సిటీ నడిబొడ్డున ఉన్న ప్రముఖ వ్యాపార కేంద్రం అమీర్‌పేట్‌లో గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మైత్రీవనం సమీపంలోని మెయిన్ రోడ్డుపై ఉన్న ఓ బట్టల దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మూడు అంతస్తుల భవనం మొత్తం నిలువెల్లా మంటల్లో చిక్కుకుని కాలిబూడిదవుతోంది. భగభగ ఎగిసిపడుతున్న మంటల ధాటికి స్థానికులు భయంతో వణికిపోతున్నారు. ఈ భవనం చుట్టుపక్కల హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్, సెల్ ఫోన్ షాపులు ఉన్నాయి. మండుతున్న ఎండల తీవ్రత వల్ల మంటలు వేగంగా పక్కనే ఉన్న ఇతర దుకాణాలకు వ్యాపిస్తున్నాయి.

దీంతో అప్రమత్తమైన తోటి వ్యాపారులు తమ షాపుల్లోని విలువైన వస్తువులను తీసుకొని బయటకు పరుగులు తీశారు. విషయం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటనా (మిగతా 2లో...)




# 'మళ్లీ నీట్ రాసే ధైర్యం లేదు'

- వైరల్ అవుతున్న విద్యార్థిని చివరి లేఖ!
- నీట్ కారణంగా ఐదేళ్లలో 93 మంది విద్యార్థులు బలి!

పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ : నీట్–యూజీ 2026 వివాదాల నేపథ్యంలో దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు కలచివేస్తున్నాయి. తాజాగా మధ్యప్రదేశ్‌కు చెందిన 18 ఏళ్ల వైద్య విద్యార్థిని ఆకాంక్ష చతుర్వేది రాసిన ఆత్మహత్య లేఖ సోషల్ మీడియాలో బయటకు రావడంతో ఈ ఉదంతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పేపర్ లీక్ ఆరోపణల నేప థ్యంలో కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయడంతో మళ్లీ పరీక్ష రాయాలనే భయంతో ఆ నిరుపేద విద్యార్థిని ఆత్మహత్యకి పాల్పడింది.

మధ్యప్రదేశ్ కు చెందిన ఆకాంక్ష చతుర్వేది నాగ్‌పూర్‌లో నీట్ పరీక్ష కోసం శిక్షణ తీసుకుంటోంది. దేశవ్యాప్తంగా పేపర్ లీకేజీల కారణంగా (మిగతా 2లో)



# మమత మనుగడ కష్టమేనా?

(మొదటి పేజీ తరువాయి)

బలం దెబ్బతింటుంది.

ఇప్పటికే టీఎంసీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు రెండుగా చీలిపోయారు. పార్టీ నుంచి బహిష్కరించిన ఎమ్మెల్యే రితాబ్రతా బెనర్జీ నేతృత్వంలోని 59 మంది రెబల్ బృందం తామే నిజమైన తృణమూల్ కాంగ్రెస్ అని ప్రకటించుకుంది. ఈ వర్గం రితాబ్రతాను ప్రతిపక్ష నేతగా ఎన్నుకోగా.. అసెంబ్లీ స్పీకర్ కూడా దానికి ఆమోదం తెలిపారు.



రెబల్ వర్గం మమతా బెనర్జీపై బహిరంగంగానే తిరుగుబాటు చేయడమే కాదు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా మమతా బెనర్జీ ఎంపిక చేసిన అభ్యర్థిని సైతం సవాల్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పేకమేడలా కూలుతోంది. తిరుగుబాటు సెగలు లోలోపల రగులుతున్నాయి. అవినీతి, ఆర్జీకర్ మెడికల్ కాలేజీ హత్యాచార కేసును పార్టీ హ్యాండిల్ చేసిన తీరుపై పలువురు సీనియర్లు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. గత వారం ముఖ్యమంత్రి సువేందు అధికారి నిర్వహించిన సమావేశానికి కూడా చాలా మంది నేతలు హాజరయ్యారు.

రాబోయే రోజుల్లో ఎంపీల్లో కూడా మరిన్ని చీలికలు వచ్చే అవకాశం ఉందని, ఇది రెబల్ వర్గానికి మరింత బలాన్ని ఇస్తుందని పార్టీ వర్గాలు సూచిస్తున్నాయి. దీంతో దీదీ దృష్టి ఇప్పుడు పార్టీ పేరు, గుర్తును కాపాడుకోవడంపైనే ఉంది. గతంలో మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ చీలికలను బట్టి చూస్తే, మమతా బెనర్జీకి ఈ పని అంత సులువుగా కనిపించడం లేదు. పార్టీ సంస్థాగతంగా కూలిపోవడం, ప్రతిపక్ష నేత పదవి చేజారడం, కలకత్తా మేయర్ కీలక నేత ఫిర్హాద్ హకీమ్ రాజీనామా వంటి పరిణామాలు మమతాను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టేశాయి. పార్టీపై పట్టును నిలుపుకోవడానికి ఆమె ఇప్పుడు అత్యంత కఠినమైన పోరాటం చేస్తున్నారు.

# అల్లాడిన హైదరాబాద్...

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా నమోదయ్యాయి. గతంలో అత్యంత భీకరమైన హీట్‌వేవ్ ఇయర్‌గా భావించిన 2015లో కేవలం 42 రోజులు మాత్రమే. ఈసారి ఆ రికార్డు బద్దలైంది. దీనికి భిన్నంగా 2021 వేసవిలో కేవలం 3 రోజులు మాత్రమే 40 డిగ్రీల సెల్సియస్ దాటింది.

2015లో ఎండలు కొన్ని రోజుల పాటు గరిష్ట స్థాయికి చేరి మళ్లీ తగ్గుముఖం పట్టాయి. కానీ 2026లో దాదాపు రెండు నెలల పాటు నిరంతరాయంగా ఉష్ణోగ్రతలు స్థిరంగా అధికంగా కొనసాగాయి. అంబర్‌పేట్, హిమాయత్‌నగర్, గచ్చిబౌలి నుంచి మేడిపల్లి వరకు నగరంలోని అన్ని శివారు, ప్రధాన ప్రాంతాలు వారాల తరబడి ఈ తీవ్రమైన ఉష్ణోగ్రతలకు గురయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలే కాకుండా.. రాత్రి వేళల్లో కూడా భూమి చల్లబడకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ విస్తరణే ఈ విపత్కర వాతావరణ మార్పుకు కారణమని నిపుణులు అంటున్నారు.

ఆకాశాన్ని తాకుతున్న ఎత్తైన బిల్డింగులు, విస్తరిస్తున్న తారు రోడ్లు, కాంక్రీట్ భవనాలు నగర సహజసిద్ధ కూలింగ్ వ్యవస్థను దెబ్బతీశాయని చెబుతున్నారు. వీటితో పాటు నగరవాసులు విరివిగా వాడుతున్న ఏసీలు లోపలి వేడిని బయటకు పంపిస్తూ.. బయట వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. వేసవి ఇంత తీవ్రంగా ఉండటం వెనుక నగరంలోని సరస్సులు, చెరువులు కుంచించుకుపోవడమే ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అడ్డూఅదుపూ లేని పట్టణీకరణ ఇలాగే కొనసాగితే.. రాబోయే దశాబ్ద కాలంలో హైదరాబాద్‌లో సాధారణ వేసవి అనే పదానికి అర్థమే మారిపోతుందని క్లైమేట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే.. పట్టణ ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు గణనీయంగా ఎక్కువగా నమోదయ్యే వాతావరణ పరిస్థితిని అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్ అంటారు. నగరాల్లోని కాంక్రీట్ కట్టడాలు, తారు రోడ్లు పగటిపూట వేడిని ఎక్కువగా పీల్చుకుని రాత్రి వేళల్లో ఆ ఉష్ణాన్ని వాతావరణంలోకి విడుదల చేస్తాయి. అలాగే పచ్చదనం, జలాశయాలు తగ్గటం వల్ల నగరాలు సహజంగా చల్లబడే గుణాన్ని కోల్పోతాయి. తద్వారా వేసవి తాపం ఎక్కువగా ఉంటుంది.

# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

స్థలానికి చేరుకున్నారు. బట్టల షాపు కావడంతో మంటల తీవ్రత అత్యధికంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపు చేస్తూ, అవి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా రక్షణ చర్యలు చేపట్టారు. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమికంగా తెలిసింది. మంటల్ని అదుపులోకి తీసుకొచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు, ఫైర్ సిబ్బంది తెలిపారు. కాగా, మంటల తీవ్రత చూస్తుంటే భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. పక్క దుకాణాలకు కూడా మంటలు వ్యాపిస్తుండటంతో నష్టం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# ప్రభుత్వం తర్జనభర్జన

(మొదటి పేజీ తరువాయి)

మద్యం తయారీకి అవసరమయ్యే ముడిసరుకులు, ప్యాకేజింగ్ మెటీరియల్స్, రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని వారు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా తమకు లాభసాటిగా ఉండాలంటే కనీసం 10 శాతం మేర కొనుగోలు ధరలను పెంచాలని వారు అభ్యర్థించారు. అయితే మద్యం కంపెనీల డిమాండ్ సమంజసంగానే ఉన్నప్పటికీ ధరలను భారీగా పెంచితే అది రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయానికి గండికొట్టే ప్రమాదం ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణ సుదీర్ఘమైన అంతరాష్ట్ర సరిహద్దును పంచుకుంటోంది. తెలంగాణలో మద్యం ధరలు గనుక విపరీతంగా పెరిగితే.. రెండు రాష్ట్రాల మధ్య రేట్ల వ్యత్యాసం భారీగా పెరుగుతుందని అంటున్నారు.

తెలంగాణలో కొనుగోలు ధరలు పెరిగితే.. అది అంతిమంగా రీటైల్ ధరలపై ప్రభావం చూపుతుంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో గనుక రీటైల్ ధరలు తక్కువగా ఉంటే సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, గద్వాల వంటి ప్రాంతాల ప్రజలు ఆంధ్రప్రదేశ్ నుంచి మద్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల తెలంగాణకు రావాల్సిన పన్నుల రూపంలోని భారీ ఎక్సైజ్ రాబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని అధికారులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. అటు కంపెనీల ప్రయోజనాలను కాపాడుతూనే ఇటు సరిహద్దు ముప్పును అరికట్టేలా జస్టిస్ సునీల్ కిషోర్ కమిటీ ఎలాంటి సిఫార్సులు చేయబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# పుణ్యక్షేత్రంలో కామాంధులు..

(మొదటి పేజీ తరువాయి)

కత్తులు, ఇనుపరాడ్లతో బెదిరించి సమీప అటవీ ప్రాంతానికి బలవంతంగా తీసుకెళ్లారు. అక్కడ బాధితురాలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, ఇద్దరి దుస్తులు తొలగించి నగ్నంగా వీడియోలు చిత్రీకరించారు. అనంతరం వారిని విడిచిపెట్టి వెళ్లిపోయారు.

వీడియోలతో బ్లాక్‌మెయిల్.. రూ. లక్ష డిమాండ్

ఘటన జరిగిన మరుసటి రోజే నిందితులు బాధితురాలికి వీడియోలను పంపించి, వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించారు. వీడియోలను బయటపెట్టకుండా ఉండాలంటే రూ.1 లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. భయాందోళనకు గురైన బాధితురాలు మొదట రూ.4 వేల రూపాయలు పంపినట్లు సమాచారం. అయితే వేధింపులు కొనసాగడంతో ధర్మపురి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. అనంతరం కేసు తిరువణ్ణామలై పడమర పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మరో రోజు.. మరో మహిళపై అదే తరహా దాడి మొదటి ఘటన మరువకముందే మరో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. తిరువణ్ణామలై మున్సిపాలిటీ పరిధికి చెందిన 23 ఏళ్ల యువతి గత నెల 31వ తేదీ రాత్రి గిరి ప్రదక్షిణ చేస్తుండగా కాళ్ల నొప్పులతో ఇబ్బంది పడింది. దీంతో అడిఅన్నామలై ప్రాంతానికి చెందిన తన స్నేహితుడిని రమ్మని పిలిచింది. అనంతరం ఇద్దరూ సమీపంలోని హోటల్‌లో టిఫిన్ చేసి అయ్యంపాలయం బైపాస్ రోడ్డు వద్దకు వెళ్లారు. అక్కడ కూడా అదే తరహాలో ఓ ముఠా వారిని అడ్డగించి, బెదిరించి సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లింది.

చిత్రహింసలు.. సామూహిక అత్యాచారం.. దోపిడీ

అటవీ ప్రాంతంలో యువతి, ఆమె స్నేహితుడిని చిత్రహింసలకు గురిచేసిన నిందితులు, యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఇద్దరినీ నగ్నంగా వీడియోలు చిత్రీకరించారు. అంతేకాకుండా యువతి చెవులకు ఉన్న సుమారు రెండు



గ్రాముల బంగారు కమ్మలను కూడా లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు తిరువణ్ణామలై పడమర పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రెండో కేసు నమోదు అయింది. ఐదు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు రెండు ఘటనలు వరుసగా చోటుచేసుకోవడంతో తమిళనాడు పోలీస్ శాఖ అత్యంత సీరియస్‌గా తీసుకుంది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ టవర్ డేటా, స్థానిక సమాచారం ఆధారంగా పోలీసులు వేగంగా విచారణ చేపట్టారు. దర్యాప్తులో రెండు ఘటనలకు సంబంధించిన 11 మంది నిందితులను గుర్తించారు.

# శరవేగంగా....

(మొదటి పేజీ తరువాయి)

ఈ సికింద్రాబాద్ స్టేషన్ మేకోవర్ అని చెప్పారు. స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టును మొత్తం రూ.714.73 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాత్రింబవళ్లు జరుగుతున్న ఈ పనులు ప్రస్తుతం 64 శాతానికి పైగా పూర్తయ్యాయని చెప్పారు. ప్రయాణికుల రాకపోకలకు వీలుగా విశాలమైన ప్రవేశ ద్వారాలు, సరికొత్త వెయిటింగ్ హాళ్లు రూపుదిద్దుకున్నాయి. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు తరహా అనుభూతిని ఇచ్చేలా అత్యాధునిక ఎయిర్‌కాన్‌కోర్స్ నిర్మాణం చివరి దశకు చేరుకుంది.

స్టేషన్‌ను ఆధునికీకరించే క్రమంలో ప్రయాణికుల సౌకర్యార్థం కింది ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగుల ప్రయాణం సులభతరం చేసేందుకు స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాహనదారుల పార్కింగ్ ఇబ్బందులను శాశ్వతంగా తొలగించేందుకు అధునాతన మల్టీలెవెల్ కార్ పార్కింగ్ వ్యవస్థను సిద్ధం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికులు నేరుగా మెట్రో స్టేషన్‌కు చేరుకునేలా అత్యాధునిక స్కైవాక్‌ల నిర్మాణం జోరుగా సాగుతోంది. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్టేషన్ ప్రాంగణంలో భారీగా ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికుల రక్షణ కోసం స్టేషన్ అంతటా అధునాతన హై-డెఫినిషన్ సీసీటీవీ కెమెరాలు అమరుస్తున్నారు.

ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే కొన్ని విభాగాలు పూర్తిగా అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల రద్దీని క్రమబద్ధీకరించడానికి నిర్మించిన తాత్కాలిక బుకింగ్ కార్యాలయం, ప్రయాణికుల రక్షణను పర్యవేక్షించే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ నూతన భవన నిర్మాణాలు వంద శాతం పూర్తయ్యాయి. వీటితో పాటు స్టేషన్‌కు దక్షిణం వైపున నిర్మిస్తున్న ప్రధాన అప్రోచ్ రోడ్డు పనులు కూడా విజయవంతంగా ముగిశాయి. ఈ పునరాభివృద్ధి పనులన్నీ త్వరలోనే పూర్తికానుండటంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ దేశంలోనే వన్-ఆఫ్-ది బెస్ట్ ఐకానిక్ స్టేషన్‌గా నిలవబోతోంది.

# 'మళ్లీ నీట్ రాసే ధైర్యం లేదు'

(మొదటి పేజీ తరువాయి)

మే 12న నీట్ పరీక్షను కేంద్రం రద్దు చేసిన కొద్దిరోజులకే.. అంటే మే 20న ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గత నెలలో జరిగినప్పటికీ, ఆమె చేతిరాతతో ఉన్న సూసైడ్ నోట్ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రతిపక్ష నేతలు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి.

'అమ్మా, నాన్నా నన్ను క్షమించండి' ఆకాంక్ష తన తల్లిదండ్రులను ఉద్దేశించి రాసిన లేఖలో మళ్లీ పరీక్ష రాయడంపై తనకున్న భయాన్ని ఎంతో ఆవేదనతో వ్యక్తపరిచింది. "అమ్మా, నాన్నా.. నేను బాగా చదువుకుని డాక్టర్‌ని అవుతానని మీరు ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. కానీ నాకు మళ్లీ నీట్ పరీక్ష రాసే ధైర్యం లేదు. మొదటిసారి రాసిన నీట్ పరీక్షలో నాకు మంచి మార్కులు వస్తున్నాయి, కానీ రెండోసారి కూడా అలాగే రాస్తాననే నమ్మకం నాకు లేదు. నన్ను క్షమించండి అమ్మా, నాన్నా.. నేను అన్నింటినీ పాడుచేశాను" అని ఆమె ఆ లేఖలో పేర్కొంది. ఆకాంక్ష తండ్రి కృష్ణ కుమార్ చౌబే మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాకు చెందిన ఓ సాధారణ రైతు. తన కూతురిని డాక్టర్‌ని చేయడం కోసం ఆయన కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా దాదాపు రూ. 3 లక్షల అప్పు చేశారు. అంతేకాకుండా కూతురి చదువు ఖర్చుల కోసం ఆయన నాగ్‌పూర్‌లో ఒక వంటవాడిగా కూడా పనిచేశారు. ఎంతో కష్టపడి చదివిన పరీక్ష రద్దు కావడంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది.


**ఐదేళ్లలో 93 మంది విద్యార్థులు బలి!**

నీట్ పరీక్ష ఒత్తిడి, పేపర్ లీకేజీల కారణంగా ప్రాణాలు కోల్పోయింది కేవలం ఆకాంక్ష ఒక్కరే కాదు.. రాజస్థాన్‌కు చెందిన 22 ఏళ్ల ప్రదీప్ మేఘ్వాల్, బిహార్‌లోని పాట్నా హాస్టల్‌లో మరణించిన శృతి కుమారి, అలాగే ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఈ పరీక్ష రద్దు తర్వాత తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకున్నారు. ఓ విశ్లేషణ ప్రకారం.. గత ఐదేళ్లలో నీట్ ఒత్తిడి తట్టుకోలేక దాదాపు 93 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. 2025లో అత్యధిక మరణాలు నమోదు కాగా.. 2026లో ఇప్పటివరకు 14 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. మే 12న పరీక్ష రద్దు ప్రకటన వచ్చిన తర్వాతే ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం.

# రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- ప్రతి దరఖాస్తు జవాబుదారీతనంతో పరిష్కారానికి చర్యలు

**సత్తుపల్లి, జూన్ 04 (పీపుల్స్ డైరీ) :** ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్హత గల దరఖాస్తును నిబంధనల ప్రకారం వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించిన సమస్యలపై గురువారం సత్తుపల్లి తహసీల్దారు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ... ప్రతి దరఖాస్తును అర్హత ఆధారంగా సూక్ష్మంగా పరిశీలించి,



నిబంధనల పరంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి జాప్యం లేకుండా జవాబుదారీతనంతో వ్యవహరించా లని సూచించారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలు రీ-సర్వే ప్రక్రియ ద్వారా శాశ్వత పరిష్కారం పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

అటవీ--రెవెన్యూ భూ సరిహద్దు వివాదాలను జాయింట్ సర్వే ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు.పరిష్కారానికి అర్హత ఉన్న ప్రతి దరఖాస్తును తక్షణమే క్లియర్ చేయాలని, పరిష్కారం సాధ్యం కాని ప్రతి దరఖాస్తుకు స్పష్టమైన కారణాన్ని అర్జీదారునికి తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అంతకుముందు వేంసూరు మండలంలోని అమ్మపాలెం గ్రామంలో జరుగుతున్న భూ సర్వే పనులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పంట పొలాల్లో క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ సర్వే ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే ఢల్యాండ్ రికార్డ్స్ అధికారి రాజేందర్, సత్తుపల్లి తహసీల్దారు లక్ష్మీ, వేంసూరు తహసీల్దారు మాణిక్యరావు, సర్వేయర్లు నాగరాజు, మురళీ, నాగు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులున్నారు.

# విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే జైలుకే!

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

మట్టెవాడ , జూన్ 04 (పీపుల్స్ డైరీ) : వ్యాపారస్తులు ఎవరైనా పాఠశాల, కళాశాల, ఇతర విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే జైలు జీవితం తప్పదని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి స్కూళ్లు, కళాశాలల పరిసరాలను టొబాకో ఫ్రీ జోన్లుగా మార్చేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు తీసుకొనేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు నిషేధమని తెలియచేస్తూ రూపొందించిన గోడ పత్రికను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత మనందరిపై వుందని. ముఖ్యంగా విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలుగా మారకుండా చేపడుతున్న చర్యల్లో భాగంగా విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు విక్రయాలు నిషేదించబడ్డాయని, ఎవరైనా విద్యా సంస్థల వద్ద విక్రయాలకు పాల్పడితే సిగిరెట్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ - 2003 యాక్ట్ క్రింద చర్యలు తీసుకోబడుతాయని, అలాగే మైనర్లకు కూడా పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే జస్టిస్ జువైనల్ యాక్ట్ 2015 యాక్ట్ 77 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. ఎవరైనా విద్యా సంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, సిసిఆర్.బి ఏసీపీ దేవిడ్ రాజు, వరంగల్ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ కె.సుజాత, ఏ.ఎస్.ఐ రాజేందర్ ప్రసాద్ పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ తోనే మానవ మనుగడ

## వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

మట్టెవాడ, జూన్ 04 (పీపుల్స్ డైరీ): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా యూత్ ఫర్ సొసైటీ ఫౌండర్ కొడిమాల శ్రీనివాసరావు రూపొందించిన పర్యావరణ పరిరక్షణ గోడ పత్రికలను, పర్యావరణ డాక్టర్ రతన్ సింగ్ రచించిన పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కరపత్రాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దీని నిర్లక్ష్యం చేస్తే తగు మూల్యం చెల్లించక తప్పదని కావున పర్యావరణ పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు. మాజీ ఎన్ఎస్ఎస్ అధికారి, యూత్ ఫర్ సొసైటీ ఫౌండర్ కొడిమాల శ్రీనివాసరావు, పర్యావరణవేత్త డాక్టర్ రతన్ సింగ్ రూపొందించిన కరపత్రాలు, గోడ పత్రికలు ప్రజలను ఎంతగానో చైతన్య పరుస్తాయని ఈ సందర్భంగా వారిని అభినందించారు. అనంతరం శ్రీనివాసరావు, రతన్ సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, అలాగే అడవులను సంరక్షించాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను నివారించాలి, ప్రజా రవాణా, సైకిల్ నడకలను ప్రోత్సహించాలి, పర్యావరణ హిత వస్తువులనే వాడాలని, వ్యవసాయంలో రసాయన, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సొసైటీ బాధ్యులు దేవిశ్రీ ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఇటుక బట్టీలకు చెరువు మట్టి!-వారం రోజులుగా చెరువులో అక్రమ తవ్వకాలు!

- తరలిపోయిన సుమారు 1500 ట్రిప్పులు మట్టి
- కొన్నేళ్లుగా ఇదే తంతు
- పట్టించుకోని అధికారులు



**రేగొండ జూన్ 04 పీపుల్స్ డైరీ :** రాజకీయ నాయకుల ప్రోద్బలం... మామూళ్లకు అలవాటుపడిన అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపం కా రణంగా లక్షలాది రూపాయలు విలువ చేసే చెరువు మట్టి అక్రమంగా ఇటుక బట్టీలకు చేరుతుంది.రేగొండ మండలంలోని దమ్మన్నపేట రూపిరెడ్డి పల్లి, చెన్నపూర్,గ్రామల చెరువుల నుంచి కొన్నేళ్లుగా వేసవికాలంలో వేలాది ట్రిప్పుల చెరువు మట్టిని అడ్డూ అదుపు లేకుండా చాటుమాటుగా ట్రాక్టర్ల ద్వారా బట్టీలకు తరలిస్తున్నారు. గతంలో గ్రామస్థులు జరుగుతున్న ఈ తతంగంపై సంబంధిత ఇరిగేషన అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోక పోవడం విడ్డురం.ప్రజలు అధికారుల పై పిర్యాదు చేసిన అధికారులు మళ్ళీ జేసీబీ, లేదంటే బట్టీల యాజమాన్యనికి సమాచారం అందిస్తు గొడవలు పుట్టిస్తున్నారు. అయితే రాజకీయ నాయకుల ప్రోద్భలంతో సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండ మట్టి తవ్వాకాలకు అనుమతులు ఇస్తున్నారు.దీనిని అదునుగా తీసుకున్న సదరు అక్రమార్కులు వారం రోజులుగా దమ్మన్న పేట,చెరువు నుంచి జేసీబీ సహాయంతో రాత్రి పూట అక్రమంగా చెరువులోని మట్టిని తవ్వుతూ సుమారు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో గంగారావి చెరువు వద్దా రెండు కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### రాత్రి సమయంలో యథేచ్ఛగా మట్టి తరలింపు

దమ్మన్న పేట శనిగకుంట చెరువులో రాత్రిపూట జేసీబీ తో మట్టిని తవ్వుతున్నారు. మట్టిని ట్రాక్టర్లలో నింపుతూ రూపిరెడ్డి పల్లి క్రాస్ మీదుగా దొంగచాటుగా తరలిస్తున్నారు. వారం రోజులుగా రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు ట్రాక్టర్లలో సుమారు 1500 నుండి 2000 ల ట్రిప్పుల మట్టిని తరలించారు. ట్రాక్టర్ మట్టి సుమారు రూ. 1500 నుంచి రూ.2వేల వరకు ధర పలుకుతుంది. ఈ లెక్కన వారం రోజుల్లోనే సుమారు రూ.30 లక్షల విలువైన ప్రజాధనం అక్రమార్కుల పాలైంది. గతేడాది సదరు అక్రమార్కులు చెరువులో మట్టి తవ్వకాలకు ప్రయత్నించారు. అయితే చెరువులో నీరు ఉండటంతో మట్టి తవ్వకాలకు అనువుగా లేకపోవడంతో తూముల ద్వారా నీటిని తొలగించారు. అ నంతరం మూడు రోజులపాటు మట్టిని తవ్వి పెద్ద గుట్టలుగా డంపింగ్ చేశారు. చాటుమాటుగా పలు ఇటుకబట్టీలకు విక్రయిస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ తతంగం జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా అక్రమార్కులను వదిలివేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు శాఖల అధికారులకు మామూళ్లు అందుతుండటం వల్లే చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపి స్తున్నారు.ఇంత పెద్ద మొత్తంలో మట్టి తవ్వాకాలకు ఎవరు అనుమతి ఇచ్చారో తెలుసుకొని అధికారి ఎంతటి వారైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు..

# గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

- ఉపాధి హామీ పథకంలో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు
- కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు

**ఏటూరు నాగారం జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తు న్నామని, ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు అన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ మండలం కేశవాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో కలెక్టర్ పాల్గొని గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలను సందర్శించి గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని, ప్రభుత్వం రైతులకు అందించే పథకాల ప్రయోజనాలు సకాలంలో అందాలంటే నమోదు కీలకమని తెలిపారు. గ్రామీణ ఉ పాధి హామీ పథకంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని, ఉపాధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగితే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీఓ భవనాలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో డీపీఓ వెంకయ్య, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# పంటల మార్పిడి పై రైతులు మొగ్గు చూపాలి..




**భూపాలపల్లి జూన్ 04 పీపుల్స్ డైరీ :** పంట మార్పిడి చాలా అవసరమని సాంప్రదాయ పంటలకు స్వస్తి పలికి ఆదాయం వచ్చే పంటల సాగుకు రైతులు మొగ్గుచూపేలా అవగాహన కల్పించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం ఘనపురం మండలం మైలారంలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదంతో 60 ఎకరాలలో పంటలు కాలిపోయాయని, నలుగురు మనుషులు కూడా మరణించారని తెలిపారు. విద్యుత్ సమస్యలను గ్రామ సభలో తెలియజేస్తే సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. చెరువు మట్టిని రైతులు పంట పొలాలకు తీసుకునేలా అవకాశం కల్పించాలని తెలిపారు. పంటలు వ్యర్థాలు కాల్చడం వల్ల భూమిలో రసాయనాలు చనిపోతున్నాయని, రసాయనం తగ్గిపోవడం వల్ల భూమికి నష్టం జరిగి దిగుబడి తక్కువ వస్తుందని రైతులు వ్యర్థాలు కాల్చోద్దని తెలిపారు. విద్యార్థులు విద్యాభ్యాసానికి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి సూచించారు. పాఠశాలలు పున:ప్రారంభం విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గానికి ఒక మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పాఠశాలలోనే విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పిల్లలను ప్రయోజకులను చేయాలని తల్లిదండ్రుల ఆశ ఉంటుందని ఉ ద్దేశంతో ప్రభుత్వం గురుకులాలను పటిష్టం చేసి నాణ్యమైన ఆహారం విద్య అందించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా సాగుచేస్తున్న భూములకు పట్టాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని వాళ్ళందరికీ పట్టాలింపించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సర్పంచులకు సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఇంటిలో మొక్కలు నాటి బాధ్యతగా పెంచాలని సూచించారు. రోడ్లకు ఇరు-వైపులా ఖాళీగా ఉన్న ప్రదేశంలో మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. గ్రామపంచాయతీలు ఆదాయం పెంచుకుని ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దాలన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తూనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి ద్వారా అర్హులకు పట్టాలు జారీచేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 8 వేల ఎకరాలలో సర్వే జరుగుతుందని, సర్వే తదుపరి పట్టాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 200 కోట్లతో 40 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, 60 ఎకరాలలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు పరిశ్రమలు, గోదాములు నిర్మాణానికి ముందుకు రావాలని సూచించారు. 50 కోట్లతో 20 వేల సామర్థ్యం కలిగిన గోదాముల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. 500 కోట్లతో బైపాస్ రోడ్డు, చెల్పూర్ నుండి గూడేప్పాడు వరకు 4 వరుసల రహదారి అభివృద్ధి చేయనట్లు తెలిపారు. గణపురం రిజర్వాయర్ పంట కాలువలు మరమ్మత్తులకు 32 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు జిల్లాలో విజయవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు కార్యక్రమాలు ఉన్నాయని అందులో భాగంగా 4,6,8, 10 తేదీలలో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ లలో వార్డు, గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీ లో జరిగే వార్డు, గ్రామసభలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ముందుకెళ్లేందుకు గ్రామస్థాయి నుంచి మున్సిపాలిటీ వరకు శాఖల వారీగా కార్యక్రమం రూపొందించి గ్రామ-సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఎన్ లినో వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్య అవకాశం ఉ ందని వాతావరణ శాఖ సూచన నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ఎలాంటి పంటలు సాగు చేయాలో వ్యవసాయ అధికారులు గ్రామ సభలలో రైతులకు వివరించాలని సూచించారు. వర్షాకాలంలో మురుగనీటి నిలువలు లేకుండా మురుగు కాలువలు పరిశుభ్రం చేయాలని సూచించారు. ఘన వ్యర్థాలు నిర్వహణ పకడ్బందీగా చేయాలన్నారు. వ్యర్థాలను వేరుచేసి నిర్వహణ చేపట్టాలన్నారు. అటవీ శాఖ ద్వారా వనమహోత్సవం గ్రామపంచాయతీలో మొక్కలు నాటాలని తెలిపారు. మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించాలి అన్నారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటర్ తమ యొక్క ఓటు వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు తప్పకుండా పరిశీలన చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి బూతు స్థాయి అధికారులు వస్తారని తమ వివరాలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఈఓ రాజేందర్, సిఐ కరుణాకర్, సర్పంచ్ సమ్మయ్య నాయక్, పిఎసిఎస్ చైర్మన్ కుమార్ యాదవ్, వైద్య, విద్యుత్ ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవా అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

- హుజురాబాద్ టౌన్ సీఐ కరుణాకర్‌కు ప్రత్యేక అభినందనలు.



**హుజురాబాద్, జూన్ 4: (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవా అవార్డు గ్రహీతలైన హుజురాబాద్ టౌన్ సీఐ టి. కరుణాకర్, హెడ్ కానిస్టేబుల్ హెచ్.సి. మల్లయ్య, ఇటీవల బదిలీపై హుజురాబాద్‌కు వచ్చిన ఏఎస్ఐ బి. సంపత్‌లను టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో హుజురాబాద్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీసీ జేఏసీ అధ్యక్షుడు సందేల వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, బీసీ ముద్దుబిడ్డ టి. కరుణాకర్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ పోలీసు సేవా అవార్డు అందుకోవడం హర్షణీయమన్నారు. హుజురాబాద్ కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటిన ఆయన సేవలను కొనియాడారు.సమాజంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసు అధికారులపై ఉందని పేర్కొన్నారు. చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తూ అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందేలా మరింత కృషి చేయాలని సూచించారు. ఇదే సేవా స్ఫూర్తితో ముందుకు సాగి జాతీయస్థాయిలో గుర్తింపు పొందే ఉత్తమ పోలీసు అధికారిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, శాలపల్లి ఇందిరానగర్ సర్పంచ్ కోడిగుడి ప్రవీణ్, హుజురాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు పుల్లా రాధా, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు రామ్ సారయ్య, తునికి సమ్మయ్య, ప్రతాప్ నాగరాజు, మంచికట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.6.25ల లక్షల విలువ గల ఆసిస్ గంజాయి ( లిక్విడ్ గంజాయి) పట్టివేత -సి ఐ ఏ.శ్రీనివాస్



**ఏటూరు నాగారం జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** ఏటూరు నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలోగల జీడివాగు వద్ద స్థానిక సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్సై బి మహేష్ పి సి లు హరీష్, చంద్రమోహన్, సదానందం, సుధాకర్, కే మహేందర్ లతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ నల్ల రంగు బజాజ్ ప్లాటినా మోటార్ సైకిల్ పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొండికుంట మండలం మల్లెల మడుగు గ్రామంకు చెందిన నల్లగట్ల సురేంద్ర కుమార్, అదే జిల్లా అదే మండలం అదే గ్రామానికి చెందిన బండ్ల సాయి అనే ఇద్దరు వ్యక్తులు మహారాష్ట్రలోని శిరొంచ వైపు హాసిస్ ఆయిల్ (లిక్విడ్ గంజాయి) ను విక్రయించడానికి తరలిస్తున్న క్రమంలో కీడువాగు వద్ద పోలీసులు అడ్డగించి పట్టుకున్నారని తెలిపారు. ఈ మేరకు నిందితులను విచారించగా ఒడిస్సా రాష్ట్రంలోని కుముర మానూరు నివాసి రాజు నాయక్ అనే వ్యక్తి నుండి హాసిస్ ఆయిల్ (లిక్విడ్ గంజాయి) కొనుగోలు చేసి అమ్మటానికి వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను ఇద్దతిని పంచుల సమక్షంలో వారిని అరెస్ట్ చేసి వారి వద్ద గంజాయి లిక్విడ్ ఆయిల్ రెండు వాహనాలు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఏ శ్రీనివాస్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోర్టులో హాజరు పరుచున్నట్లు సీఐ పేర్కొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామసభలు నిర్వహించాలి-ఎంపీడీవో శ్రీనివాస్

**ఏటూరు నాగారం జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా ఈనెల 4, ,6, 8, 10 తేదీలలో అన్ని గ్రామాలలో అధికారులచే గ్రామ సభలో నిర్వహించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ సభలలో చర్చించాల్సిన అంశాలను వివరించారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పారిశుధ్యం మురుగు కాలువల కూడికతీత పొదలు, పిచ్చి మొక్కల తొలగింపు, వీధి దీపాల పునరుద్ధరణ, త్రాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, ఎస్ డబ్ల్యూ పి ఐ నియమాలు 2036 పై చర్చ, సంరక్షణ, మట్టి సంరక్షణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై చర్చించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ సభలు నిర్వహించడానికి ఆయా గ్రామాల కు అధికారి టీం లీడర్ పేరు ఇన్చార్జి పేర్లను తెలియజేశారు. ఇట్టి గ్రామ సభలో పాల్గొని మండల స్థాయి మండల స్థాయి డివిజనల్ స్థాయి అధికారుల వివరాలను తెలిపారు.

# స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం




**రేగొండ జూన్ 04 పీపుల్స్ డైరీ :** చిన్న నాటి స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. రూపిరెడ్డి పల్లి ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో చదుకున్న స్నేహితులు తోటి స్నేహితుడు మృతి చెందగా అతని కుటుంబంనికి అండగా నిలిచారు.రూపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కనుకుంట్ల గోపి గ్రామ ప్రైమరీ పాఠశాలలో చదివాడు. ఇటీవల కరెంట్ షాక్తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పూర్వ స్నేహితులు గురువారం గోపి ఇంటికి వెళ్లి బాధితకుటుంబాన్ని పరామర్శించారు. రూ. రూ.12,000ల రూపాయల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పన్నాటి శ్రీనివాస్, ముదుతన పల్లి శంకర్, (జీప్) చిలుపూరి శంకర్, మద్ది సంపత్, బొద్దిరెడ్డి జయపాల్ రెడ్డి, మంచాల రాజు ( రిపోర్టర్) అలగం రాజు, షేక్ షబ్బీర్, పంచగిరి దేవేందర్, పంచగిరి రమేష్, ఏనుగుల బిక్షపతి, మంచుపెల్లి సురేష్,పలువురు స్నేహితులు ఉన్నారు.

# నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ

### ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాలలో ఉచిత భోజన వసతితో శిక్షణ

**ఏటూరు నాగారం జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాలలో ఉచిత భోజన వసతి తో శిక్షణ కల్పించబడుననీ, కోర్సులు యొక్క వివరాలు.బ్యూటిషన్ 9వ తరగతి అర్హత కలిగి డొమెస్టిక్ ఐటి హెల్ప్ డెస్క్ అటెండెంట్. ఇంటర్ ఆపైనా పైన తెలుపబడిన కోర్సులు ములుగు నందు తేదీ ఈనెల ఈనెల 6.నుండి ప్రారంభం అగుచున్నవి. కావున ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు తమ యొక్క దరఖాస్తులతో బ్రిలియంట్ స్కూల్ ప్రక్క బిల్డింగ్, కొత్త బస్టాండ్ ఎదురుగా, ములుగు నందు సంప్రదించగలరు. కావున ఈ యొక్క అవకాశాన్ని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోగలరనీ శిక్షణానంతరం వివిధ ప్రముఖ ప్రైవేటు కంపెనీల నందు ఉపాధి అవకాశాలు కల్పించబడును. మరియు సర్టిఫికెట్ ఇవ్వబడును. ఇతర వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9966216380

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డు సభలు



**హుజురాబాద్ జూన్ 04 (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు ఆధ్వర్యంలో వార్డు సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలు వార్డుల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వార్డులలో ఉన్న మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలను ప్రజలు నేరుగా వార్డు అధికారులకు తెలియజేయాలని కోరారు.అలాగే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని చైర్‌పర్సన్ సూచించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ బి. కిషన్, ఆర్డీఓ రమేష్ బాబు, ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**సైదాపూర్ జూన్ 4 ( పీపుల్స్ డైరీ:) :** రాష్ట్ర బీసీ & రవాణా సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో సైదాపూర్ తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వివిధ గ్రామాల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు & వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి & షాదీ ముబారక్ 42 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను అందిస్తామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, పెరిక పల్లి సర్పంచ్ పోతరాజు బబిత, సైదాపూర్ సర్పంచి మునిగంటి స్వప్న, ఘన పూర్ సర్పంచ్ బాసరాజు రజిత, ఆరేపల్లి సర్పంచ్ వర్ని లావణ్య, దుద్దెనపల్లి సర్పంచ్ ఉడిగె విజయలక్ష్మి, సోమారం సర్పంచి కందుల అనిత, ఎల్ల బోతారం సర్పంచ్ నమిండ్ల రవీందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ డైరీ యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం-ఎంపీడీఓ వీరేశం




**భీమదేవరపల్లి జూన్ 4 (పీపుల్స్ డైరీ ) :** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ (బీసీ కార్పొరేషన్) ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్ట్ కింద డైరీ యూనిట్ (పాడి పరిశ్రమ) ఏర్పాటు చేసుకునేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని బీసీ సామాజిక వర్గాల ఆర్థిక అభ్యున్నతి, స్వయం ఉపాధి పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పైలట్ ప్రాజెక్టును చేపట్టింది. ఈ పథకం కింద డైరీ యూనిట్లను ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి కలిగిన లబ్ధిదారులు తమ దరఖాస్తులను అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో (కులం, ఆదాయం, ఆధార్ కార్డ్ తదితర వివరాలు) జతపరిచి, ఈ నెల 11వ తేదీ లోపు సంబంధిత మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవని, శ్రీకాబట్టి అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

## భూగర్భ జలాల పెంపుదలకు కృషి

**ప్రతి ఇంటికొక ఇంకుడు గుంత - ప్రతి పొలానికొక కుంట**



**ఎల్కతుర్తి జూన్ 4(పీపుల్స్ డైరి) :** మన ఇంటి మీద పడే వాన నీటిని వృధా చేయకుండా, ఇంకుడు గుంత ద్వారా భూమిలోకి ఇంకించాలని ఎం పి డి ఓ విజయ్ కుమార్ గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. దీనివల్ల మన బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరుగుతుంది. వేసవిలో నీటి కష్టాలు తప్పుతాయి అన్నారు. పొలంలో వాన నీరు నిల్వ ఉంచేందుకు పంట కుంటలు తవ్వాలి. ఈ నీరు పంటలకు తడి ఇవ్వడంతో పాటు, భూగర్భ జలాలను రీఛార్జ్ చేస్తుంది. కరువు వచ్చినా పంటలు ఎండిపోవు అని తెలిపారు. ఊరి చివరన పెద్ద ఊట కుంటలు, చెక్ డ్యాములు నిర్మించాలి. వానాకాలం నీరంతా ఇందులో నిల్వ ఉండి, ఊరంతటికీ భూగర్భ జలం పెరుగుతుంది. చెరువులు, కుంటలు నిండుతాయి అన్నారు. వాన చినుకు ఒక్కటి కూడా వృధా కాకూడదు. పడ్డ ప్రతి చినుకును ఒడిసి పట్టి, భూమాత కడుపులో దాచాలి. అప్పుడే భవిష్యత్ తరాలకు నీటి కరువు ఉండదు అన్నారు.

## అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ



**ఆళ్ళపల్లి ,జూన్ 2(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో పనిచేస్తున్న 108 అంబులెన్స్ వాహనాన్ని గురువారం కొత్తగూడెం జిల్లా అధికారి కురుమ సతీష్ కుమార్ తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాలను వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు అలాగే వాహనం మరమ్మతులకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 108 సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది పరమ సునీల్ కుమార్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన దమ్మన్నపేట విద్యార్థి.



**రేగొండ జూన్ 04 పీపుల్స్ డైరీ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన కూచన రాజేందర్, స్వప్న దంపతుల కుమారుడు కూచన గణేష్ జేఈఈ అడ్వాన్స్‌డ్-2026లో ప్రతిభ కనబరిచాడు. ఓబీసీ విభాగంలో 904వ ర్యాంకు సాధించి గ్రామానికి, కుటుంబానికి గర్వకారణంగా నిలిచాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. చిన్నప్పటి నుంచే చదువులో మెరుగైన ప్రతిభ కనబరుస్తూ వచ్చిన గణేష్ పదో తరగతిలో 10 జీపీఏ సాధించాడు. అనంతరం ఇంటర్మీడియట్‌లో 980 మార్కులు సాధించి తన ప్రతిభను మరోసారి నిరూపించాడు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదవాలన్న లక్ష్యంతో కృషి చేసిన గణేష్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించడం ద్వారా తన కలను సాకారం చేసుకునే దిశగా ముందడుగు వేశాడు. గణేష్ విజయంపై గ్రామస్థులు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియ జేశారు. అతని విజయం గ్రామంలోని విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

- **శారద ఐసీడీఎస్ అధికారి**
- **మేడ్చల్ 7వ అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత మేళా**



**మేడ్చల్ జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** మేడ్చల్-7వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రథమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత మేళా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ అధికారి శారద మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. చిన్నారులకు ఆటలు, పాటలు, కథల ద్వారా విద్యాబోధన అందించి వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిల్లల శారీరక వికాసం, భాషా వికాసం, బుద్ధి వికాసం, సామాజిక, భావోద్వేగ వికాసం, పూర్వ గణిత వికాసం వంటి ఐదు ప్రధాన అభివృద్ధి అంశాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ అభివృద్ధి అంశాలు పిల్లల భవిష్యత్తు విద్యాభ్యాసానికి బలమైన పునాది అవుతాయని చెప్పారు. అలాగే గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం, బాలామృతం వంటి పోషకాహారాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రథమ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ లలిత, మాస్టర్ ట్రైనర్లు తిమ్మప్ప, చైతన్యలు పిల్లలకు వివిధ ఆటలు నిర్వహించి వారి నైపుణ్యాలను పరీక్షించారు. సుమారు 60 మంది చిన్నారులు ఆటలు, పాటలు, కథలు, సంభాష ణలు, పూర్వ గణిత భావనలను ప్రదర్శించి తల్లిదండ్రులను ఆకట్టు కున్నారు. కార్యక్రమం ముగింపులో పిల్లల భాషా, మేధో, సామాజిక అభివృద్ధి మరియు సృజనాత్మకతకు సంబంధించిన వివరాలను తల్లిదండ్రుల కు తెలియజేసి, చిన్నారుల రిపోర్ట్ కార్డులను ఐసీడీఎస్ అధికారి శారద అందజేశారు. ఈ కార్యక్రమంలో హైమావతి, అంగన్వాడీ టీచర్లు శోభారాణి, ఇందిరా, ధనలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బసవయ్య గౌడ్ కృషి చిరస్మరణీయం

- **శంకరపట్నం లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మండల అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.**



**శంకరపట్నం జూన్:04 పీపుల్స్ డైరీ :** శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్. గారి జన్మదిన వేడుకలు శంకరపట్నం మండలం లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ సభ్యులు. మాజీ జెడ్పీటీసీ శ్రీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ గారు హాజరై బసవయ్య గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు చెప్పరు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాలు జరిపారు. ఈ సందర్భంగా బసవయ్య గౌడ్ కు శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఆయన ఎన్నో సంవత్స రాలుగా చేసిన సేవలను నాయకులు కొని యాడారు. జన్మదినోత్సవాన్ని పురస్కరిం చుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి తిరుపతి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతిని ధులు, అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పం చులు, ఉప సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బసవయ్య గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బసవయ్య గౌడ్ చేసిన కృషి చిరస్మరణీయమని, భవిష్యత్తులో కూడా పార్టీ అభివృద్ధికి వారి మార్గదర్శకం అవసరమని పేర్కొన్నారు. శంకరప ట్నం మండల కాంగ్రెస్ పార్టీ తరఫున గోపగోని బసవయ్య గౌడ్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

# గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం..

**ఎంపీడీఓ వెంకటేశ్వర్ రావు,**



**రేగొండ జూన్ 04 పీపుల్స్ డైరీ..** రేగొండ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రూపిరెడ్డి పల్లి గ్రామంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్ రావు, సర్పంచ్ కుమార స్వామి ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించరు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతు ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకొని రైతులు ఎరువులు, విత్తనాలు, సరఫరా పై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఎల్ ని నో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున పంటల మార్పిడి నీటి పొదుపు సమతుల్య ఎరువుల వినియోగం పై రైతులకు అవగాహనా కల్పించాలని కోరారు. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటినుండి వచ్చే చెత్తను తడి పొడి చెత్త వేరు చేసి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించలని అన్నారు. తడి వ్యర్థలతో సేంద్రియ ఎరువుల తయారీ, పొడి చెత్తతో రీసైకిలింగ్ద్వారా గ్రామాలని శుభ్రంగా ఉంచవచ్చు అన్నారు. గ్రామాలను తీర్చి దిద్దెందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని రాక్షంచాలని పర్యావరణ పరిరక్షణ పై అవగాహనా పెంచాలని సూచించారు. ప్రకృతి విపత్తులు సంబవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహనా కల్పించాలని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. కలిసి కట్టుగా అభివృద్ధి చేసుకోవాలని అందుకు అధికారుల సహకారం ఎప్పుడు ఉంటుందని తెలిపారు.

**సర్పంచ్ కుమారస్వామి మాట్లాడుతు...**

గ్రామాభివృద్ధి కి ప్రజల సహకారం ఎంతో అవసరమనీ గ్రామంలో పరిశుభ్రత తాగునిటీ సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధి తో పాటు తడి, పొడి చెత్త వేరు వేరుగా ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. గ్రామాన్ని ఆదర్శవంతమైన, పరిశుభ్రమైన, గ్రామంగా తీర్చిదిద్దం దుకు అందరి భాగస్వామ్యం కావాలని పిలుపుని చ్చారు.. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేతా రావు, మండల వ్యవసాయ అధికారి వాసుదేవ రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, గ్రామ వార్డ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

**రామన్నగారి రాఘవేందర్ గౌడ్**



**మేడ్చల్, జూన్ 4(పీపుల్స్ డైరీ) :** మేడ్చల్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, పట్టణ ప్రజలు మరియు కాలనీ వాసులు ఓటరు జాబితాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ కోరారు. కాలనీల్లోని కొన్ని ఇళ్ల చిరునామాలపై సంబంధిత కుటుంబాలకు తెలియకుండా అనర్హులు లేదా అక్కడ నివసించని వ్యక్తుల పేర్లు ఓటరు జాబితాల్లో నమోదై ఉండే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఇంటి చిరునామాపై నమోదైన ఓటర్ల వివరాలను పరిశీలించి, అక్కడ నివసించని వారి పేర్లు ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెలలో ప్రభుత్వం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జనగణన కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను ధృవీకరించనున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ వివరాలను సక్రమంగా అందించి, ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటిని సరిదిద్దం దుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితాలు అత్యంత అవసరమని రాఘవేందర్ గౌడ్ తెలిపారు. ఓటరు జాబితాల్లోని పొరపాట్లను సరిదిద్దే ప్రక్రియలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా పాల్గొని అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణం, కాలనీల అభివృద్ధి, సమాజ శ్రేయస్సు, స్వేచ్ఛాయుత మరియు నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొంటూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్న గారి రాఘవేందర్ గౌడ్ పిలుపునిచ్చారు.

# మెడినోవా ఆస్పత్రిలో అరుదైన కిడ్నీ సమస్యకు విజయవంతమైన శస్త్రచికిత్స

- **పుట్టుకతో వచ్చిన మూత్రపిండ లోపంతో పాటు స్టాగ్‌హార్న్ రాయిని తొలగించిన మెడినోవా వైద్యులు**



**మేడ్చల్, జూన్ 4(పీపుల్స్ డైరీ) :** పుట్టుకతో వచ్చిన కిడ్నీ నిర్మాణ లోపంతో పాటు ఇతర క్లిష్ట సమస్యలతో బాధపడుతున్న యువకుడికి మేడ్చల్ పట్టణంలోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి ఆరోగ్యవంతుడిగా మార్చారు. మేడ్చల్ జిల్లాకు చెందిన 37 ఏళ్ల నవీన్ చారి తీవ్ర ఎడమవైపు నడుము, పొత్తికడుపు నొప్పితో ఆసుపత్రిని ఆశ్రయించారు. ఆసుపత్రికి చెందిన యూరాలజీ నిపుణుడు డా. బి. నితేష్ పరీక్షలు నిర్వహించగా, రోగికి పుట్టుకతోనే ఎడమ మూత్రపిండం నుంచి మూత్రాశయానికి ఒకటి కాకుండా రెండు మూత్ర నాళాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితిని వైద్యపరంగా "డూప్లెక్స్ సిస్టం"గా పిలుస్తారని అదేవిధంగా మూత్ర ప్రవాహానికి అడ్డంకి ఏర్పడటంతో పాటు ఎడమ మూత్ర పిండంలో మూత్రాన్ని సేకరించే భాగాన్ని పూర్తిగా కప్పివేసే భారీ స్టాగ్‌హార్న్ రాయి కూడా ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో రోగి తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని డా. నితేష్ నేతృత్వంలోని వైద్య బృందం సుదీర్ఘ శస్త్రచికిత్స నిర్వహించింది. ఒకేసారి ఓపెన్ పైలోలిథోటమీ, ఆండర్సన్-హైన్స్ పైలోప్లాస్టీ, డీజే స్టెంటింగ్ వంటి మూడు శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. అదనంగా ఉన్న మూత్రనాళాన్ని తొలగించడంతో పాటు మూత్రనాళంలో ఉన్న అడ్డంకిని సరిచేసి, మూత్రపిండంలో ఉన్న భారీ రాయిని తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం ప్రత్యేక వైద్య పర్యవేక్షణ, నొప్పి నియంత్రణ చికిత్స అందించగా రోగి ఆరోగ్య పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. అనంతరం అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా డా. నితేష్ మాట్లాడుతూ, ఒకే రోగిలో పుట్టుకతో వచ్చిన కిడ్నీ నిర్మాణ లోపం, మూత్రనాళ అడ్డంకి, భారీ స్టాగ్‌హార్న్ రాయి వంటి సమస్యలు ఒకేసారి కనిపించడం అరుదైన విషయమని తెలిపారు. సమగ్ర పరిశీలనతో పాటు ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా ఈ చికిత్సను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. చికిత్స పొందిన నవీన్ చారి మరియు ఆయన కుటుంబ సభ్యులు వైద్య బృందానికి, ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి క్లిష్ట యూరాలజీ శస్త్రచికిత్సలను నిర్వహిస్తూ మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నాణ్యమైన వైద్య సేవలను అందిస్తోందని ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు.

# భీమదేవరపల్లిలో బెల్ట్ షాపులపై సర్పంచ్ ఉక్కుపాదం



**భీమదేవరపల్లి జూన్ 4 (పీపుల్స్ డైరీ ):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి గ్రామాన్ని మద్యం రహితంగా మార్చేందుకు సర్పంచ్ మాచర్ల కుమారస్వామి కఠినంగా వ్యవహరించారు. బెల్ట్ షాపుల బంద్‌కు కొనసాగింపుగా గురువారం సర్పంచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య, వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది గ్రామంలోని బెల్ట్ షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వాటి వద్ద బ్యాలెన్స్‌గా ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మళ్లీ బెల్ట్ షాపులు నిర్వహిస్తే రూ.10 వేల జరిమానా విధించడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మహమ్మారిని గ్రామం నుంచి పూర్తిగా తరిమికొట్టేందుకు పంచాయతీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గ్రామ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మద్యం వ్యసనానికి దూరంగా ఉండాలని, ఎవరైనా అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సర్పంచ్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు..

# తుమ్మల చెరువు కాలువ బాగుచేయాలి- ఐదు గ్రామాల రైతులను ఆదుకోవాలి

- **కట్టు.కాలువను మత్తటిని వెంటనే మరమ్మతులు చేపట్టాలి**
- **మునిపాల శ్రీనివాస్ బి ఆర్ఎస్ నాయకులు**





**సైదాపూర్: జూన్ 4 ( పీపుల్స్ డైరీ ) :**సైదాపూర్ తుమ్మల చెరువు కట్టు కాలువకు వెంటనే మరమ్మతులు చేపట్టి రైతులను నష్టాల నుంచి కాపాడాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మునుపాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు తుమ్మలచెరువు కట్టు కాలువ రెండు చోట్ల తెగిపోయిందని, ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.తెగిన ప్రాంతాల్లో మట్టి, రాళ్లతో అడ్డుకట్ట వేసి కట్టను బలోపేతం చేయాలని కోరారు. ఆలస్యం చేస్తే భారీ నష్టం సంభవించే అవకాశం ఉందన్నారు.తుమ్మలచెరువు మత్తడి పడిన సమయంలో వచ్చే వరద నీటితో సైదాపూర్, జాగిరిపల్లి, ఆరేపల్లి, బూడిదపల్లి, సోమారం గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములు నీటమునిగి రైతులకు భారీ పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు చెరువు కట్టపై ఇరువైపులా తుమ్మ చెట్లు, పొదలు విస్తరించి రైతులు కనీసం నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తొలగించి కట్టను బాగు చేయాలని కోరారు పోల్కమ్మ చెరువుకు సాగునీరు అందించే రెండు తూములు కూడా దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణ పరిరక్షణలో ఇప్పల్ నర్సింగాపూర్ రైతు ఆదర్శం

- **పంట అవశేషాలను భూమిలో కలిపి ఆదర్శంగా నిలిచిన రైతు గూడూరి స్వామి రెడ్డి**



**హుజురాబాద్, జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** పంట అవశేషాలను తగలబెట్టి పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో హుజురాబాద్ మండలం ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతు గూడూరి స్వామిరెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఇప్పల్ నర్సింగాపూర్ గ్రామ శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో రోటరీ మల్చర్ యంత్రం సహాయంతో పంట అవశేషాలను భూమిలో కలియదున్ని పర్యావరణ పరిరక్షణకు తోడ్పడ్డారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అధికారులు హాజరై రైతు స్వామిరెడ్డి చేసిన వినూత్న ప్రయత్నాన్ని అభినందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి జి. సునీత మాట్లాడుతూ పంట అవశేషాలను భూమిలో కలియదున్నడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పంట అవశేషాలు కుళ్లిపోవడం ద్వారా సేంద్రియ కార్బన్ పెరిగి నేల సారవంతంగా మారుతుం దని తెలిపారు. మొక్కలకు అవసరమైన నత్రజని, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు తిరిగి నేలలో కలుస్తాయని పేర్కొన్నారు.అలాగే నేల నిర్మాణం మెరుగుపడి గాలి ప్రసరణ పెరగడంతో వేర్ల వ్యవస్థ బలపడు తుందని, నేలలో తేమ ఎక్కువకాలం నిల్వ ఉండటం వల్ల నీటి అవసరం తగ్గుతుందని వివరించారు. సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి భూమి ఆరోగ్యంగా మారుతుందని తెలిపారు. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల కలిగే నష్టాలను కూడా ఆమె వివరిం చారు. నత్రజని, గంధకం వంటి విలువైన పోషకాలు వృథా కావడంతో పాటు, నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూమి నిస్సారంగా మారుతుందని హెచ్చరించారు. అదేవిధంగా కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి వాయువులు విడుదలై వాయు కాలుష్యం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నిఖిల్ కుమార్, రైతు గూడూరి స్వామిరెడ్డి, దండ వెంకటరమణ రెడ్డి, గూడూరు మల్లారెడ్డి, బండి సమ్మయ్య, గూడూరు చైతన్య రెడ్డి, గూడూరు లక్ష్మారెడ్డి, చివుల సమ్మయ్య, కాటిపల్లి కిషన్ రెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు. రైతు స్వామిరెడ్డి చూపిన మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని మండలంలోని రైతులందరూ పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని అధికారులు పిలుపునిచ్చారు

# విద్యుత్ సమస్యలు తక్షణమే పరిస్కారించాలి

**ఎమ్మెల్యే గండ్ర, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

- **భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొన్నారు**




**భూపాలపల్లి జూన్ 04 పీపుల్స్ డైరీ :** ఇండ్ల పైనుంచి వెళు_న్న విద్యుత్తుతీగలు సమస్యలు అలాగే విద్యుత్ లేని ఇండ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు సంబంధించి పుల్లు రామయ్యపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొన్నారు.ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళికలో వ్యవసాయ పొలాలలో విద్యుత్ పోల్స్, ట్రాన్స్ ఫార్మర్లు మార్చేందుకు తక్షణమే విద్యుత్ శాఖ అధికారులకు దరఖాస్తు ఇచ్చినట్లయితే ఉచితంగా మారుస్తారని తెలిపారు. విద్యుత్ సరఫరా లేని ఇళ్లకు పోల్స్ వేసి ఉచితంగా విద్యుత్తు ఇచ్చే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. మన ఇంటిని మన వాడను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రంగా ఉంటేనే పరిపూర్ణమైనటు ఆరోగ్యం సొంతమవుతుందని తెలిపారు. అటవీశాఖ, సింగరేణి గమున్సిపాలిటీ నుంచి మొక్కలు ఇస్తారని ప్రతి ఇంటిలో మొక్కలు పిల్లల్ని ఏ విధంగా పెంచుతామో వృక్షాలను కూడా అదే విధంగా పెంచాలని సూచించారు. మొక్కలు పెంచడం వల్ల ఫలాలు రావడంతో పాటు వాతావరణ సమతుల్యత నుండి కాపాడుతుందని తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి అలాగే పాఠశాలలకు అవసరమైనటువంటి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. రైతులు, పేదల పిల్లలు మంచిగా చదువుకుని ఐపిఎస్, ఐఏఎస్, ఇతర శాఖల అధికారులుగా ఎదగాలని, తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. పాఠశాలలకు అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు అందజే యాలని తెలిపారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం నాటికి యూనిఫామ్స్ పుస్తకాలు నోటు పుస్తకాలు అందించడంతో పాటు విద్యార్థులకు 21 కిట్లతో వెల్కం చెప్పాలని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రైవేట్ స్కూల్ కి వెళ్తున్న విద్యార్థులపై ఫోకస్ పెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా, వైద్య రంగాల మీద ప్రభుత్వం ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో 78000 మంది నిరుద్యోగ ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. జిల్లాకు చెందిన 2700 మంది నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. సింగరేణి, టాస్క్ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తూ యువతకు ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాలకు వెళ్లి విద్యార్థులు శిక్షణ పొందాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదని జిల్లా కేంద్రంలో ఉచితంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాథ ల్యాబ్ ఏర్పాటు చేయనట్లు తెలిపారు. విద్య వైద్యంతో పాటు అన్నిరం గాలలో అభివృద్ధి చేయడమే కాకుండా మౌలిక సదుపాయాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు కొడవటంచ లక్ష్మి నరసింహా స్వామి దేవాలయాన్ని యాదగిరిగుట్టలాగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే బుగులోని వెంకటేశ్వర స్వామి దేవాలయానికి రహదారి కోనేరు, ఐమాక్స్ లైట్లు పెట్టి కళ్యాణమండపాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు జనగణలో పాల్గొనాలని సూచించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. చిరునామాలో మార్పులు చేర్పులు మరణించిన వ్యక్తుల పేర్లు తొలగింపు వంటి విచారణకు బూతు స్థాయి అధికారులు ఇంటింటికి వస్తారని సమాచారం ఇవ్వాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రజాప్రణాళిక కార్యక్రమంలో 4,6,8,10 తేదీల్లో ప్రతి గ్రామం, మున్సిపాలిటీ వార్డులలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్షాకాలం సన్నద్ధత ఈ సంవత్సరం ఎల్ నినో వల్ల వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచన మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవగాహన కలిగించాలని తెలిపారు. గ్రామపంచాయతీ మండల జిల్లా స్థాయిలో పంటల సాగుపై కార్య చరణ తయారు చేయాలని సూచించారు. నీటి ఎద్దడిని తట్టుకునే పంటలు సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని తెలిపారు. మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలని సూచించారు. వర్షాలు వస్తే తక్షణమే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఫ్లాష్ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని తెలిపారు. మురుగునీటి నిలువ లేకుండా వార్డులలో మురుగు కాల్వలు పరిశుభ్రం చేయాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొన్నందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు అధికారులు అందరూ సమన్వయంతో కార్యక్రమాలను విజయ వంతంగా నిర్వహించాలని తెలిపారు.ఈ సమావే శంలో స్థానిక సంస్థల అతను కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, కౌన్సిలర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి ఘన సన్మానం

**మున్సిపల్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి- మాజీ సర్పంచ్ రాజా మల్లారెడ్డి**



**మేడ్చల్ జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డిని ఆయన కార్యాలయంలో డబిల్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ రాజా మల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు భాగ్యరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌తో మున్సిపల్ పరిధిలోని పలు ప్రజా సమస్యలపై చర్చించారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం రాజా మల్లారెడ్డి, భాగ్యరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు, మున్సిపల్ పరిధిలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కమిషనర్ కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# మన ఊరు బడి మన గ్రామ బడి




**ఎల్కతుర్తి జూన్ 4( పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని దండేపల్లి గ్రామ పరిధిలోని తుర్కపల్లె లో గురువారం ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. తమ పిల్లల భవిష్యత్తు అభివృద్ధి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రులు సానుకూలంగా స్పందిస్తూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో 6 మంది, ప్రాథమిక పాఠశాలలో 10 మంది విద్యార్థులను చేర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోలిపెల్లి సంపత్ వార్డు మెంబర్లు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీ ప్రోత్సాహకాలు రైతులు వినియోగించుకోవాలి



**మెట్ పల్లి జూన్ 4:(పీపుల్స్ డైరీ) :** ప్రజా పాలన -ప్రగతి ప్రణాళి క లో భాగం గా మల్లాపూర్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణలో గు రువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ పం చాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్నినో వలన రైతులు పంట మార్పిడి చే సుకోవాలని, సబ్సిడీ ప్రోత్సాహకాలు రైతులు విని యోగించుకోవాలని అన్నా రు. ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ సు గంధ ద్రవ్య పంటలైనటువం టి పసుపు,అల్లం సాగు చేయాలని నూనె పంటలు ఆ యిల్ ఫామ్ సాగు చేసుకో వాలని అన్నారు. సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రె డ్డి గ్రామంలో కోతులు, పం దులు,కుక్కల బెడద తగ్గించాలని కోరారు.హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు.ఉప సర్పంచ్ సోమ రెడ్డి,తహసీల్దార్ రామ్ చందర్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మనో హర్ రెడ్డి,విద్యుత్ ఏ.ఈ వి నీత్ రెడ్డి,పోలీస్ సిబ్బంది, జీ.పీ.ఓ జల,మండల కాంగ్రె స్ పార్టీ అధ్యక్షులు మాట్ల సోమయ్య,అన్మాండ్ సోమే శ్,వార్డు సభ్యులు కొంపెల్లి రాకేష్,అంగన్వాడీ టీచర్ లు,ఆశా కార్యకర్తలు గ్రామ స్తులు పాల్గొన్నారు.

# కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థాన భూముల కౌలు వేలం పాట



**భీమదేవరపల్లి జూన్ 4 (పీపుల్స్ డైరీ ) :**హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానానికి సంబంధించిన భూముల కౌలు వేలం పాటలు గురువారం నిర్వహించారు.ఆలయ కార్యనిర్వాహణ అధికారి పి.కిషన్ రావు ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ పారదర్శకంగా సాగింది.ఈ వేలం పాటలో సర్వే నెంబర్ 95 గుర్రాల స్వప్న -- 8,000/-,సర్వే నెంబర్ 28, 29: ముప్పు వెంకటయ్య -- 37,500/- సర్వే నెంబర్ 97 మంగ రవీందర్ -- 9,000/-,సర్వే నెంబర్ 40 కొత్తపల్లి రవీందర్ -- 3,600/-, భూములను వేలం పాటలో దక్కించుకున్నారు.ఈ వేలం పాట ద్వారా రూ.58,100 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమం లో పర్యవేక్షణ అధికారి నందనం కవిత, ముల్కనూర్ ఎస్సై రాజు, గ్రామ పెద్దలు,గ్రామ సర్పంచ్, ఆలయ పాలకవర్గం సభ్యులు, చంటయ్యపల్లి ఉప సర్పంచ్, ఆలయ అర్చకులు,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# సాజిద్ కుటుంబానికి జిల్లా ఐ జేయు అధ్యక్షుడి పరామర్శ



**మెట్‌పల్లి జూన్ 4:(పీపుల్స్ డైరీ) :** టి యు డబ్ల్యు జే (ఐజే యు) జగిత్యాల కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా తం డ్రి మృతి పట్ల టి యు డ బ్ల్యు జే (ఐజేయు) జిల్లా అ ధ్యక్షులు చీటీ శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. గ త వారం రోజుల క్రితం వారి తండ్రి మరణించగా, గురు వారం జిల్లా ఐ జేయు అ ధ్యక్షులు చీటి శ్రీనివాసరా వు , రాష్ట్ర కార్యవర్గ సభ్య లు వారి నివాసానికి వెల్లి కు టుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అ డిగి తెలుసుకున్నారు. కు టుంబ సభ్యులకు తమ ప్ర గాఢ సానుభూతిని తెలిపా రు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమ యంలో ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆ కాంక్షించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఐ జేయు జనరల్ సెక్రెటరీ సంపూర్ణ చారి, క్యా షియర్ వేణు గోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణు గోపాల చారి, మెట్ పల్లి ప్రె స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బూరం సంజీవ్, ఉపాధ్యక్షు లు మొహమ్మద్ అఫ్రోజ్, సంయుక్త కార్యదర్శి పింజరి శివ,కార్యవర్గ సభ్యులు పొ నగాని మహేందర్, రాజేం దర్, సభ్యులు తేలు కంటి గంగాధర్, 20 వార్డు కౌన్సి లర్ మసూల ప్రవీణ్, తదిత రులు పాల్గొన్నారు.

# ఇంచార్జ్ మంత్రి చొరవతో ధాన్యం నిల్వలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు




**నంగునూరు, జూన్ 04 :** ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి ప్రత్యేక చొరవతో రైతుల ధాన్యం నిల్వలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు నంగునూరు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తెలిపారు. గురువారం గట్ల మల్యాల, పాలమకుల గ్రామాల్లోని గోదాములను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ గట్ల మల్యాల, ఖాతా, అంకుశాపూర్, ముండ్రాయి, రాజగోపాలపేట గ్రామాలకు చెందిన రైతుల ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఇంచార్జ్ మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా గోదాములను కేటాయించినట్లు వెల్లడించారు. రైస్ మిల్లుల్లో తగినంత స్థలం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆరుకాలం కష్టంతో పండించిన ధాన్యానికి ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పీఏసీఎస్‌లు, డ్వాక్రా మహిళా సంఘాలకు సంబంధం లేకుండా ప్రభుత్వం నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో పాటు ప్రత్యేక గోదాముల్లో నిల్వ చేయడం ద్వారా రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాతా సర్పంచ్ పుల్లూరు సోనీ మహేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లింగం యాదవ్, జీపీవోలు మమత, రమేష్, ఉ పసర్పంచ్‌లు తిప్పని శ్రీనివాస్, ఏటీ చంద్రం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాండ్ల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ గంగుల రవి, కరెడ్ల వెంకట్ రెడ్డి, డ్వాక్రా మహిళా సంఘాల సీసీలు, కాంగ్రెస్ నాయకులు భాస్వరాజు రాములు, ఆరెపల్లి సురేష్, రాజు, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా లకుడారం గ్రామంలో వార్డు సభ

**పటాన్చెరు, జూన్ 4 :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా లకుడారం గ్రామంలో మున్సిపల్ చైర్మన్ మోటే సుమలత ఆధ్వర్యంలో వార్డు సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుమలత మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు లకుడారం గ్రామంలోని మూడు వార్డుల్లో వార్డు సభలను నిర్వహించామని తెలిపారు. సభలో ప్రధానంగా గ్రామంలోని పారిశుద్ధ్య సమస్యలు, మురుగునీటి నిర్వహణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ, తడి--పొడి చెత్త వేరు చేసే విధానం వంటి అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఒంపు ప్రాంతాలు, ఇండ్ల మధ్య నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకునేలా గ్రామస్తులకు సూచనలు ఇచ్చామని తెలిపారు. అలాగే ఓటరు జాబితా మ్యాపింగ్, సవరణలు, సెన్సస్ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారుల ద్వారా ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్ కిషన్, ఎమ్మార్వో, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ



**శంకరపట్నం జూన్ :04 పీపుల్స్ డైరీ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో శంకరపట్నం మండలం లోని తాడికల్, చింతగుట్ట, అంబాలపూర్, కరీంపేట, నల్ల వెంకయ్య పల్లి గ్రామాలలో గురువారం గ్రామ సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా సాంప్రదాయ పంటలతో పాటు లాభసాటి పంటల మార్పిడి పై నూతన వ్యవసాయ విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా రాబోయే వాన కాలం సీజన్ లో గ్రామ ప్రజలు రోగాల బారిన పడకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లను నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, మండల తాహసిల్దార్ సురేఖ, ఎంపీడీవో అనిత , ఎంపీ ఓ ప్రభాకర్, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- **బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి-ఎంపీడీవో జనార్ధన్**

**చిన్నకోడూరు, జూన్ 04 :** ప్రజా సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జనార్ధన్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రామంచలో సర్పంచ్ భవాని నవీన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని రైతులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని గ్రామంలో విస్తృతంగా నిర్వహించాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తడి, పొడి, హానికర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి చెత్త బండికి అందించాలని సూచించారు. అలాగే గ్రామంలోని బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు.



### బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన

ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైవి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంపీడీవో జనార్ధన్, సర్పంచ్ భవాని నవీన్ కుమార్, ఉపసర్పంచ్ పావని తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కనకయ్య, రాజు, గ్రామ కార్యదర్శి శేఖరానంద చారి, ఏపీపీసీ చైర్‌పర్సన్ ప్రేమలత, ఉపాధ్యాయులు సునీత, వరప్రసాద్, యాదయ్య, వేణు, గ్రామస్తులు రఘువర్ధన్ రెడ్డి, జీవన్ రెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, రామవ్వ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# కురుమ సంఘం భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తాం

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 04 :** కురుమ సంఘం సామాజిక భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పేర్కొన్నారు. గురువారం జీడిమెట్ల డివిజన్ బీరప్ప నగర్ లోని బీరప్ప కామరాతి దేవాలయం సమీపంలో కురుమ సంఘం సామాజిక భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కురుమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే ని కోరారు. గత 12 ఏళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో పలు సామాజిక భవనాలను నిర్మించామని, కురుమ సంఘం సామాజిక భవనం పనులు ఇప్పటికే నిర్మాణ దశలో ఉన్నాయని, త్వరలోనే మిగిలిపోయిన పనులను పూర్తిచేసి అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



ఇంతకుముందు బీరప్ప స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించగా, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు నార్ల కంటి బాలయ్య, మాజీ అధ్యక్షులు చంద్రయ్య, చైర్మన్ బి.నరసింహ, పెద్ద కురుమ జి.యాదయ్య, సెల్వోజి జి.సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్లు సాయి కుమార్, నార్లకంటి రామకృష్ణ, ఉపాధ్యక్షులు వి.యాదగిరి, చంద్ర శేఖర్, ఈకే.శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి మహేందర్, సంయుక్త కార్యదర్శి ఎన్.శంకర్, కోశాధికారి ఎన్.జగదీష్ కుమార్, వైస్ చైర్మన్ బాలరాజు, మల్లేష్, సలహాదారులు ఎన్.నాగేష్, ఎన్.పెంటయ్య, కె.అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.వేణు, కుల బాంధవులు నార్ల కంటి నరసింహ, నార్ల కంటి కుమార్, నార్ల కంటి ఎట్టయ్య, విష్ణు, బీరప్ప నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సంపత్, కాలనీవాసులు వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణారెడ్డి, బాల మల్లేష్, కె.నిరంజన్, ఎన్.అశోక్, కె.చంద్రయ్య, జీడిమెట్ల డివిజన్ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- **దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి**

**తొగుట, జూన్ 04 :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తొగుట వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డితో కలిసి ఆయన స్థానిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లు, మక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటల కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా చర్చించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జరిగిన కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి, మిగిలిన ధాన్యాన్ని గోనె సంచులు, ఇతర వసతులు అందుబాటులో ఉంచి త్వరితగతిన కొనుగోలు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతుల శ్రమకు తగిన గిట్టుబాటు లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ సమీర్ హైమద్ ఖాన్, సీఐ లతీఫ్, ఏపీఎం బాబురావు, ఏఓ మోహన్, కోఆపరేటివ్ సెక్రటరీ గంగారెడ్డి, తొగుట సర్పంచ్ పాగాల శోభ కొండల్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పిట్ల సత్తయ్య, లింగంపేట సర్పంచ్ గొడుగు జయమ్మ నర్సింలు, పెద్ద మాసాన్ పల్లి సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, జప్తి లింగారెడ్డిపల్లి సర్పంచ్ కనకయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కం స్వామి, ఏఎంసీ డైరెక్టర్లు సత్తయ్య, బిక్షపతి, భరత్ తేజ, ఎన్నం భూపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మల్లారెడ్డి, బూస నిరంజన్ రెడ్డి, సోలిపేట ప్రసాద్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లు-ఎమ్మెల్యే జిఎంఆర్

- **అతిత్వరలో నాలుగు సబ్ స్టేషన్ల ప్రారంభం.. ఇనుప స్తంభాల తొలగింపుకు ఆదేశాలు**

**పటాన్చెరు, జూన్ 4 :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్థంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, భూ కేటాయింపులు, పూర్తయిన సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవాలపై సమగ్రంగా చర్చించారు. పటాన్చెరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇండోర్ సబ్ స్టేషన్‌తో పాటు సింఫనీ కాలనీ, పోచారం, లకడారం ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్ల పనులు తుది దశకు చేరుకున్నాయని, అతి త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మాదారం, రామేశ్వరంబండ, ఉస్మాన్నగర్, బొల్లారం ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల కోసం భూ కేటాయింపులు పూర్తయ్యాయని చెప్పారు. ఒక్కో సబ్ స్టేషన్‌కు రూ.5 కోట్ల నిధులు ఆర్థిక శాఖ నుంచి మంజూరు కావాల్సి ఉందని, వెంటనే నిధులు విడుదల చేయాలని ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఇనుప విద్యుత్ స్తంభాలు ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని, వాటిని వెంటనే తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న స్తంభాలను కూడా తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ఘాతంతో పశువులు మృతి చెందిన సందర్భాల్లో రైతులకు ఆలస్యం చేయకుండా తక్షణమే నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందితే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసి అవసరమైన స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ప్రస్తుత వేసవికాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించినందుకు విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా పనిచేయాలని కోరారు. మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సరఫరాకు విద్యుత్ కోతలు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిధుల కొరత తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి సీఎస్ఆర్ నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డీఈ భాస్కరరావు, ఏడీఈలు సంజయ్, దుర్గాప్రసాద్, నాగరాజు, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రణాళికబద్ధంగా డివిజన్ల అభివృద్ధి

### ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్చెరు, జూన్ 4 :** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ, మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని కర్దనూరు గ్రామం సిద్ధార్థ కాలనీలో రూ.65 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే తెల్లాపూర్ డివిజన్ పరిధిలో హుడా కమాన్ నుంచి రేడియం రోడ్డు వరకు ప్రధాన రహదారి మీడియన్, పాత్‌వే నిర్మాణ పనులకు రూ.87 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 9 డివిజన్ల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయాలని ఇటీవల సృజనను కలిసి విన్నవించినట్లు తెలిపారు. అతి త్వరలో ప్రతి డివిజన్ అభివృద్ధికి అదనపు నిధులు మంజూరు కాబోతున్నాయని చెప్పారు. వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీల్లో కూడా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తెల్లాపూర్ పరిధిలో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, కుమార్, సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు లచ్చిరామ్ నాయక్, బాబ్జి, శ్రీశైలం, శ్రీకాంత్, ఉమేష్, రవీందర్ రెడ్డి, నాగరాజు, బల్దియా ఇంజనీరింగ్ విభాగం డీఈ కృష్ణవేణి, ఏఈ ఫైజన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



# భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం

- **ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై అపోహాలను వీడి ప్రజలు సహకరించాలి**
- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
- **ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




ఖమ్మం, జూన్ 04 (పీపుల్స్ డైరీ) : భవిష్యత్తు తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలోనీ రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వేదికలని అన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిపై గ్రామస్తులతో చర్చించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్న నేపథ్యంలో బోర్‌వెల్ సౌకర్యం కలిగిన రైతులు షార్ట్ డ్యూరేషన్ వరి సాగు చేపట్టవచ్చని తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని, భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలు మెరుగైన జీవనం సాగించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని అన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా ఓట్లు తొలగిపోతాయనే ప్రచారం పూర్తిగా అపోహ మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి.జ్యోతి, ఆత్మ పిడి బి.సరిత, ఏవో ఉమా నగేష్, పశు వైద్యులు జగ్గులాల్ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులున్నారు.

# రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం కమ్యూనిస్టుల వల్లనే సాధ్యం






**నల్లబెల్లి, జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** దేశంలో గత 72 సంవత్సరాలుగా దళిత బహుజనులకు, కార్మిక, కర్షక, యువతతో సహా మెజారిటీ ప్రజలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాన్ని అందించడంలో కాంగ్రెస్, బీజేపీతో పాటు అన్ని ప్రాంతీయ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జనగామ మాజీ ఎమ్మెల్యే సిహెచ్. రాజారెడ్డి విమర్శించారు. మండల కేంద్రమైన నల్లబెల్లిలో జూన్ 3, 4, 5 తేదీలలో జరుగుతున్న సిపిఐ వరంగల్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'పార్టీ కార్యక్రమం–నిర్మాణం, ప్రజా సంఘాల నిర్మాణం' అనే అంశంపై ఆయన క్యాడర్కు దిశా నిర్దేశం చేస్తూ మాట్లాడారు.

**బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ ఊడిగం -- మోసకారి విధానాలు**

12 సంవత్సరాల పరిపాలన తర్వాత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. నిత్యావసర వస్తువుల వాడకం తగ్గించాలని, బంగారం కొనుగోళ్లు, విదేశీ యాత్రలు ఆపేయాలని చెబుతూ, ఈ సంక్షోభానికి ప్రజలే కారకులైనట్టు మాట్లాడటం బీజేపీ దివాళాకోరుతనానికి నిదర్శనం.ప్రజల కష్టార్జితంతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా అమ్మేస్తున్నారు. బ్యాంకుల నుంచి కార్పొరేట్లు ఎగ్గొట్టిన రూ. 16 లక్షల కోట్ల అప్పులను ప్రజల పన్నుల ఖజానా నుండి బ్యాంకులకు జమ చేస్తూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోంది.ఈ ఆర్థిక మోసాలను ప్రజలు గమనించకుండా ఉండేందుకే మతాన్ని, దేవుళ్లను ముందుకు తెచ్చి ప్రజల భావోద్వేగాలతో ఆటలాడుకుంటున్నారు. 2014కు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని బీజేపీ నెరవేర్చలేదు.

ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లో కమ్యూనిస్టులు, వామపక్ష అభ్యుదయవాదులు అధికారంలోకి రావడాన్ని ఎవరూ ఆపలేకపోతున్నారని, మన దేశంలో కూడా యువత ఆలోచనల్లో వస్తున్న శాస్త్రీయ మార్పులకు కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాజారెడ్డి స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలపై ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పార్టీ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఈ శిక్షణా తరగతులకు గీసుగొండ మండల కార్యదర్శి గుండె భద్రి ప్రిన్సిపాల్గా వ్యవహరించగా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనస ప్రసాద్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి దండు లక్ష్మన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు దామెర కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిలువేరు విజయ, అక్కపెల్లి రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి, సంగెం మండల కార్యదర్శి ఆరెల్లి ప్రభాకర్, వర్ధన్నపేట మండల సహాయ కార్యదర్శి బొడ్డుపెల్లి సాయిలు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క మొగిలి, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు సువర్ణ, నెక్కొండ మండల కార్యదర్శి చెన్నకేశవులు, నల్లబెల్లి మండల కార్యదర్శి బట్టు సాంబయ్య, మండల నాయకులు పరికి కోర్నేలు, మామిండ్ల అయిలయ్య, నల్లబెల్లి గ్రామ కార్యదర్శి కనకం సాల్మన్, ఏఐటీయూసీ నల్లబెల్లి మండల గౌరవ అధ్యక్షులు జన్ను సుదర్శన్, మండల అధ్యక్ష కార్యదర్శులు మామిడిపల్లి సంపత్, శనిగరం చిరంజీవి, మామిడిపల్లి రవి, అంబిరాజు, దండెం రాజ్ కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# చోరీ కేసు ఛేదించిన పోలీసులకు అభినందనలు...

ఖమ్మం, జూన్ 4 (పీపుల్స్ డైరీ) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కెయుసి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం. 669/2025, 670/2025, 14/2026 (సెక్షన్ 331(3), 305(ఏ) బిఎన్ఎస్ కింద కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు ఇతర రాష్ట్ర నేరస్థులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఖమ్మం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బందిని, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. వివరాలలోకి వెళ్ళితే.. ఇటీవల వరంగల్ జిల్లా, కెయుసి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులు చోరీ సొత్తుతో ఖమ్మం మీదుగా వెళ్లే రైల్లో పారిపోతున్నట్లు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించిన వరంగల్ జిల్లా పోలీసులు వెంటనే ఖమ్మం జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బంది ప్రయాణికుల్లాగా ఖమ్మంలో రైలు ఎక్కి ప్రతి రైలు భోగిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ... రైలు మధిరకు వచ్చే సరికి పశ్చిమ బెంగాల్ కు చెందిన ఎస్కె. ఫిరోజ్, ఎస్కె.ఎమిన్, ఎస్కె.సుఖ్ చంద్ అనే ముగ్గురు నిందుతులను గుర్తించి చాకచక్యంగా పట్టుకొని వరంగల్ జిల్లా పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైమ్ పోలీసులు తక్షణమే స్పందించి అందించిన అమూల్యమైన సహకారానికి వరంగల్ జిల్లా పోలీస్ కమిషనర్ సన్ ప్రిత్ సింగ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ అందించిన ప్రశంస పత్రాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా సిబ్బందికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, సిసిఎస్ ఏసీపీ సర్వర్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలన, రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన

**ఖమ్మం, జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం చింతకాని మండలం వందనం గ్రామంలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో చింతకాని పోలీసుల ఆధ్వర్యంలో రహదారి ప్రమాదాల నివారణ, గంజాయి (మత్తు పదార్థాల) నిర్మూలన, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరేందర్ మాట్లాడుతూ... నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ చాలా అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో అమాయకులను బురిడీ కొట్టిస్తూ డబ్బులు కాజేస్తున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీ (ఓటీపీ), లేదా బ్యాంక్ వివరాలను ఎవరికీ షేర్ చేయవద్దని, ఏదైనా అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయకూడదన్నారు.

గంజాయి, ఇతర మత్తుపదార్థాల వాడకం వల్ల యువత భవిష్యత్తు అంధకారమవుతోందన్నారు. విద్యాసంస్థలు, పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా గంజాయి దందా పెరిగిపోతోందని, దీనివల్ల యువత ఆరోగ్యం క్షీణించి, చదువును మధ్యలోనే ఆపేయడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం జరుగుతోందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ ఉండాలన్నారు. యువతను శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంచడానికి క్రీడలు, యోగా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల వైపు మళ్లించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అతివేగాన్ని నియంత్రించడం, ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించడం, వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్లు, మద్యం వంటి పరధ్యానాలకు దూరంగా ఉండటం అత్యంత ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో), సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇతర శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# గ్రామ సభల నిర్వహణ

చిట్యాల, జూన్ 4(పీపుల్స్ డైరీ) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని తిరుమలాపూర్ చల్లగరిగ చిట్యాల ముచినిపర్తి జూకల్ గుంటూరు పల్లి గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ తాసిల్దార్ వసంతరావు ఎస్సై పోచంపల్లి సతీష్ ఎంపీఓ రామకృష్ణ ఏఈఓస్ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్లు వార్డు మెంబర్స్ పంచాయతీ కార్యదర్శులు జిపి ఆఫీసర్స్ గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.


# రోడ్డు ప్రమాదంలో లైన్ ఇన్స్పెక్టర్‌కు గాయాలు



**గోవిందరావుపేట, జూన్ 4( పీపుల్స్ డైరీ)** మండల పరిధిపసర లో గురువారం విధులు నిర్వహిస్తున్న విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ దండు రామ్ చందర్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు, వివరాల్లోకి వెళితే పసర 163 జాతీయ రహదారి కర్షక్ సీడ్మిల్ సమీపంలో అనుకోకుండా కుక్కలు ఎదురు రావడంతో, బైక్ ఢీకొట్టడం జరిగింది. వైద్య చికిత్స జరుగుతుంది. స్వల్ప గాయాలు కావడం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు,

# అగ్ని ప్రమాదంతో ఫామాయిల్ తోట దగ్ధం





**మొగుళ్ళపల్లి జూన్ 4( పీపుల్స్ డైరీ) :** మండలంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఫామాయిల్ తోట దగ్ధం అయింది. జిల్లాలో పంట పొలాల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాల నివారణపై ప్రభుత్వ అధికారులు ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రమాదాల కారణంగా రైతులకు జరిగే నష్టాలపై పలుమార్లు అర్థమయ్యేలా వివరించిన ఫలితం మాత్రం శూన్యం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మొగుళ్ళపల్లి మండలం రంగాపురం గ్రామ శివారులో. మాజీ సింగల్ విండో చైర్మన్, రైతు పోల్నేని లింగారావు కు చెందిన ఏడు ఎకరాల భూమిలో ఫామాయిల్ తోట పంట సాగుచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వారు. వరి కొయ్యలకు నిప్పు పెట్టగా మంటలు చెలరేగి రైతు పోల్నేని లింగారావుకు చెందిన ఫామాయిల్ తోటలోకి మంటలు వ్యాపించి మంటల్లో ఏడెకురాల ఫామాయిల్ తోటతో పాటు అగ్ని ప్రమాదంలో, డ్రిప్స్ పైపులు, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. దాదాపు అగ్ని ప్రమాదంలో పది లక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్లు రైతు పోల్నేని లింగారావు తెలిపారు. ప్రభుత్వ అధికారులు అగ్ని ప్రమాదంలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతు పోల్నేని లింగారావును ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో సర్పంచ్లకే చైర్మన్ పదవి ఇవ్వాలి

**నల్లబెల్లి ఎంపీడీవోకు బిఆర్ఎస్ సర్పంచ్ల ఫోరం వినతి పత్రం**



**నల్లబెల్లి జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో సర్పంచ్లను చైర్మన్లుగా నియమించాలని మరియు గ్రామసభల ద్వారానే అర్హులను ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాలని నల్లబెల్లి మండల బిఆర్ఎస్ సర్పంచ్ల ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం నల్లబెల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కి సర్పంచ్ల ఫోరం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దస్తగిరిపల్లె సర్పంచ్ పులి రమేష్ గౌడ్, ముచ్చింపుల తండా సర్పంచ్ మచ్చిక రవీందర్ గౌడ్ గార్లు మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరగాలంటే స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచ్ల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. గ్రామసభల నిర్వహణ ద్వారానే నిజమైన లబ్ధిదారులను గుర్తించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ విషయమై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ), వరంగల్ జిల్లా కలెక్టర్, మరియు హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) ల దృష్టికి తీసుకెళ్లాలని, తమ డిమాండ్లతో కూడిన లేఖలను వారికి పంపించాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం ప్రతినిధులు, పాల్గొన్నారు.


# సీఎస్, హౌసింగ్ మంత్రికి రిజిస్టర్ పోస్ట్ ద్వారా సర్పంచ్ల వినతి

**- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై నల్లబెల్లి బిఆర్ఎస్ సర్పంచ్ల ఫోరం చర్యలు**



**నల్లబెల్లి జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో సర్పంచ్లను భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేస్తూ నల్లబెల్లి మండల బిఆర్ఎస్ సర్పంచ్ల ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఉన్నతాధికారులకు వినతిపత్రాలు పంపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ) తో పాటు, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఈ వినతిపత్రాలను పంపించినట్లు ఫోరం ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా దస్తగిరిపల్లి సర్పంచ్ పులి రమేష్ గౌడ్ మరియు ముచ్చింపుల తండా సర్పంచ్ మచ్చిక రవీందర్ గౌడ్ గార్లు మాట్లాడుతూ... గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలంటే సర్పంచ్లను చైర్మన్లుగా నియమించి, గ్రామసభల ద్వారానే అర్హులను ఎంపిక చేయాలని కోరారు.స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచ్ల ఆధ్వర్యంలోనే లబ్ధిదారుల గుర్తింపు జరగాలని, అప్పుడే నిజమైన పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని వారు ఈ వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

# చిత్రలేఖనం తో ఆమంచ రవి పర్యావరణ పై అవగాహన



**వరంగల్ జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వరంగల్ నగరంలోని ఉరుసు ప్రాంతానికి చెందిన ఆమంచ రవి పర్యావరణ పరిరక్షణ పై ఒక చిత్రం వేసి ప్రజలకు ఉపయోగపడే చెట్లను నిర్మూలన వల్ల ప్రజలకు



కాలుష్యం ఏర్పడి రానుల కాలంలో మన కన్నీరే మనకు నీరుగా ఉపయోగపడే పరిస్థితులు ఏర్పడతాయని ప్రజలకు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాలలో ఒక మొక్కను నాటి పెంచి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమంచి రవి తెలిపారు.

# ఆకేరు వాగులో ఇసుక అక్రమాలపై ఆరోపణలు

- బక్కతండ శివారులో వసూళ్ల దందా సాగుతోందంటూ గ్రామస్తుల ఫిర్యాదులు
- సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి



**నర్సింహులపేట, జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బక్కతండ గ్రామ శివారులోని ఆకేరు వాగులో జరుగుతున్న ఇసుక తవ్వకాలు, రవాణాపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల అవసరాల కోసం అనుమతించిన ఇసుక తరలింపు కొందరి అక్రమ సంపాదనకు మార్గంగా మారిందనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి చేరాల్సిన నిధులు అక్రమ వసూళ్ల రూపంలో వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్థానికుల కథనం ప్రకారం, ఇసుక తరలించే వాహనాల నుంచి కూపన్ లేకుంటే రూ.1,000 వరకు, కూపన్‌పై సంబంధిత అధికారుల సంతకం లేకుంటే అదనంగా రూ.500 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారిక రుసుములకు మించి ఈ వసూళ్లు ఏ ప్రాతిపదికన జరుగుతున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇసుక రవాణా ప్రాంతంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ, కూపన్లను పరిశీలించి ఫోటోలు తీస్తున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ, అక్రమాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల అమలు కోసం జరుగుతున్న పర్యవేక్షణేనా, లేక మరేదైనా వ్యవస్థ పనిచేస్తోందా అన్న సందేహాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి.

ఆకేరు వాగులో ఇసుక రవాణా వ్యవహారంపై గతంలోనూ పలుమార్లు ఫిర్యాదులు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, గ్రామస్థులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదని పేర్కొంటున్నారు. ప్రతి సారి ఆరోపణలు వెలుగులోకి వచ్చినా కొద్ది రోజులకే విషయం మరుగున పడిపోవడం వెనుక కారణాలపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.

ఇక రాత్రి వేళల్లోనూ భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయని, వాగు సహజ స్వరూపం దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలపై, పర్యావరణ సమతుల్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, గనుల శాఖ, రెవెన్యూ ఉన్నతాధికారులు ప్రత్యేక బృందంతో ఆకేరు వాగులో జరుగుతున్న ఇసుక రవాణాపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.





# గ్రామాలలో గ్రామ సభలు

- ప్రభుత్వ పథకాలపై అవగాహన
- మొక్కలు నాటి పచ్చదనానికి శ్రీకారం

**ఏన్కూర్ జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని రేపల్లెవాడ, బి ఎన్ తండా గ్రామపంచాయతీలలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్లు అజ్మీర సురేష్, ధారావత్ మణి అధ్యక్షత వహించారు. ఈ గ్రామ సభలకు డి ఆర్ డి ఏ .పి డి. శ్రీ రామ్, ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, అగ్రికల్చర్ ఏడీఏ కరుణశ్రీ, ఏవో నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, వివిధ శాఖల ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో భాగ్యశ్రీ మాట్లాడుతూ 'రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నాం. ఆరు గ్యారెంటీలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, గృహజ్యోతి, మహాలక్ష్మి, చేయూత పథకాల అమలు తీరు, లబ్ధిదారుల ఎంపికపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు.

**రైతులకు వ్యవసాయ సూచనలు:**

ఏడీఏ కరుణశ్రీ మాట్లాడుతూ 'ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువులను ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. నకిలీ విత్తనాల బెడద లేకుండా అధికారులు నిఘా పెట్టారు. పంటల బీమా, రైతు భరోసా నమోదు ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించాం' అని అన్నారు. గ్రామ సభ ముగిసిన అనంతరం 'వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా పంచాయతీ ఆవరణలో అధికారులు, సర్పంచ్, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. 'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలి. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది' అని సర్పంచ్ అజ్మీర సురేష్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల వద్దకే వస్తున్నాయి. గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ గ్రామ సభలు ఎంతో ఉపయోగపడతాయి. అధికారుల సహకారంతో రేపల్లెవాడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం' అని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

# నకిలీ హెచ్ టి గ్లైసెల్ పత్తి విత్తనాలపై ఉక్కుపాదం

## వైరా డివిజన్ ఏ.డి.ఏ టి. కరుణ శ్రీ



**ఏన్కూరు జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూర్ మండలంలో ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని వైరా డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏ డి ఏ) టి. కరుణ శ్రీ పురుగుమందులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి వ్యాపారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నకిలీ మరియు అక్రమ హెచ్ టి గ్లైసెల్ పత్తి విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అధిక దిగుబడులు వస్తాయని ప్రచారం చేస్తూ కొందరు అక్రమ వ్యాపారులు రైతులను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రభుత్వం అనుమతి ఇవ్వని హెచ్ టి గ్లైసెల్ పత్తి విత్తనాల అమ్మకం, నిల్వ మరియు వినియోగం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె స్పష్టం చేశారు. ఇటువంటి విత్తనాలను వినియోగించడం వల్ల మొలక శాతం తగ్గడం, పంట ఎదుగుదల దెబ్బతినడం, కలుపు మందుల ప్రభావం సరిగా పనిచేయకపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. రైతులు కేవలం లైసెన్స్ పొందిన విత్తన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, విత్తన ప్యాకెట్లపై కంపెనీ పేరు, లాట్ నంబర్, గడువు తేదీ, మొలక శాతం మరియు ధృవీకరణ వివరాలను పరిశీలించాలని తెలిపారు. ఈ సందర్భంగా రేపల్లెవాడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు ఏ.డి.ఏ టి. కరుణ శ్రీ హాజరై రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. గ్రామ నిఘా సమితి ఆధ్వర్యంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏ ఈ ఓ లు) సభ్యులుగా గ్రామ స్థాయిలో నకిలీ విత్తనాల విక్రయాలపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

గ్రామంలో ఎవరైనా నకిలీ లేదా అక్రమ హెచ్ టి గ్లైసెల్ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. నకిలీ విత్తనాల విక్రయాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ నిగ్రణ సమితి సభ్యులు పూర్తిస్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి విత్తన దుకాణాలు, గోదాములు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే వ్యవసాయ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏన్కూర్ మండల వ్యవసాయ అధికారి ఏ వో. నరసింహారావు , వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ నిఘా సమితి సభ్యులు మరియు రైతులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న సర్పంచ్ భాస్కర్



**చిట్యాల, జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని నైన్ పాక గ్రామ సమీపంలో మెయిన్ రోడ్డు మీద గురువారం కురిసిన భారీ వర్షం గాలి దుమారం కారణంగా రోడ్డు పైన చెట్లు కూలగ వాహనాల రాకపోకల ఇబ్బందిని చూసి స్పందించిన గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్ ఇసుక ట్రాక్టర్ సహాయంతో కూలిన చెట్టును రోడ్డు పక్కకు నెట్టి వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలుగకుండా మరమత్తులు చేశారు. మంచి మనసుతో మానవత్వం చాటిన సర్పంచి భాస్కర్ ను పలువురు అభినందించారు. వారి వెంట యువ నాయకులు యాధండ్ల మహేష్ దొంతుల వెంకటేష్ ఉన్నారు.

# ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచాలి

**-ఉన్నతాధికారులతో సమీక్షలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి**



**ఖమ్మం, జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ (బిఎస్ఎన్ఎల్ ) నెట్‌వర్క్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో అందించాలని, మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు లేకుండా నిరంతరాయంగా సేవలు అందేలా చూడాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అధికారులను ఆదేశించారు.?గురువారం హైదరాబాద్ లోని తన నివాసంలో టెలికాం విభాగం (డాట్), ఏపీఎల్ఎస్ఏ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. భాస్కరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జి. గణేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.లక్ష్మణ కుమార్, బిఎస్ఎన్ఎల్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సి. రమణలతో ఆయన సమీక్ష నిర్వహించారు.



**-25 కొత్త టవర్ల ఏర్పాటు ఆవశ్యకత వివరించిన ఎంపీ :** ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ... ఇటీవల కేంద్ర టెలికాం కార్యదర్శిని కలిసి ఉభయ జిల్లాల్లో ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్యను అధిగమించడానికి 25 నూతన టవర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు గుర్తు చేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, సరిహద్దు గ్రామాల్లో ఫోన్, ఇంటర్నెట్ సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను గుర్తించి, సత్వరం చర్యలు తీసుకోవాలని ఎంపీ ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులు, సాంకేతిక అంశాలను ఎంపీకి వివరించారు.

# జాతీయ జూడోకు నర్సింహులపేట విద్యార్థిని



జూడో పోటీల్లో తలపడుతున్న యశ్వంతిక..(తెలుపు రంగు దుస్తుల అమ్మాయి)

**నర్సింహులపేట, జూన్ 4 ( పీపుల్స్ డైరీ):** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట గ్రామానికి చెందిన బాల్నే యశ్వంతిక జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికై జిల్లా ప్రతిష్ఠను నిలబెట్టింది. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆమె, వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో 44 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో ఈ నెల 10 నుంచి చండీగఢ్‌లో జరగనున్న జాతీయ స్థాయి జూడో పోటీల్లో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. యశ్వంతిక సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, క్రీడా ఉపాధ్యాయులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# మంటల్లో పంట పొలాలు

- నేలలో జీవ పదార్థాలు నశిస్తాయి
- పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత

మన దేశం వ్యవసాయదారితదేశం రైతు కష్టంతో పండే పంటలే దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది. అయితే ఇటీవల కాలంలో పంట కోత అనంతరం పొలాల్లో మిగిలే పంట వ్యర్థాలను కాల్చివేయడం ఒక పెద్ద సమస్యగా మారింది.

ఈ చర్య వల్ల నేల సారవంతం తగ్గి పోవటం మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం కలుగుతుంది.

పంట పొలాల్లో మిగిలే చెత్తను కాల్చివేయటం రైతులకు తాత్కాలికంగా సులభమైన మార్గంగా కనిపించిన దీనివల్ల నేలలో ఉండే జీవపదార్థాలు నశిస్తాయి. భూమిలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు చనిపోవడం వల్ల నేలశక్తి తగ్గిపోతుంది. భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలలను అందించాలంటే పంట వ్యర్థాలను కాల్చకుండా ఉండాలి.

పంట అవశేషాలను సేంద్రీయ ఎరువులుగా మార్చుకోవడం ఉత్తమ మార్గం. ఇలా తయారయ్యే ఎరువులు భూమిని మరింత సారవంతం చేస్తాయి.(రసాయన ఎరువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రైతులు అధిక ఖర్చుతో వాటిని కొనుగోలు చేయాల్సి వస్తుంది. అయితే పంట వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా ఉపయోగిస్తే రసాయన ఎరువుల అవసరం తగ్గుతుంది. దీనివల్ల రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుంది. అంతేకాకుండా పండే పంటలు కూడా ఆరోగ్యకరంగా ఉంటాయి.

పంట వ్యర్థాలను కాల్చడం వల్ల గాలిలో విషపూరిత వాయువులు విడుదలవుతాయి. దీనివల్ల వాతావరణ కాలుష్యం పెరిగి వేసవి తాపం మరింత పెరుగుతుంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. చెట్లు పక్షులు చిన్న జీవులు కూడా ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి ప్రకృతిని రక్షించాలంటే పొలాల్లో మంటలు పెట్టే అలవాటు తగ్గించాలి.

పొలాల్లో పెట్టే మంటలు కొన్ని సందర్భాల్లో గ్రామాలకు కూడా ప్రమాదకరంగా మారుతున్నాయి. గాలి వేగంగా వీస్తే మంటలు పక్కనే ఉన్న ఇళ్లకు చెట్లకు వ్యాపించే అవకాశం ఉంది. దీనివల్ల ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం జరగవచ్చు. అందువల్ల అగ్ని ప్రమాదాల నుండి గ్రామాలను ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత.

ఈ సమస్యకు పరిష్కారం రైతులను చైతన్యవంతులుగా మార్చడంలో ఉంది. ప్రభుత్వం వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. పంట వ్యర్థాల ఉపయోగాలు సేంద్రీయ ఎరువుల తయారీ విధానాలను వివరించాలి. గ్రామస్థాయిలో శిక్షణ నిర్వహించి రైతుల్లో అవగాహన పెంచాలి.

రైతులను చైతన్యవంతులుగా మార్చడంలో రెవెన్యూ వ్యవసాయ పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. పంట పొలాల్లో మంటలు పెట్టకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలి. గ్రామస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రైతులకు సహాయం చేయాలి. చట్టపరమైన చర్యలతో పాటు ప్రోత్సాహక కార్యక్రమాలు కూడా నిర్వహించాలి.

పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలు ఎన్నో ఉన్నాయి. భూమి సారాన్ని కాపాడుకోవడం ప్రకృతిని సంరక్షించడం భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణ అందించడం మనందరి బాధ్యత. రైతులు ప్రభుత్వం ప్రజలు కలిసి పని చేస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.



వ్యాసకర్త : బొమ్మ రాజమౌళి
ప్రభుత్వ ఉపాధ్యాయులు
జడ్పీహెచ్ఎస్ చిట్యాల
జయశంకర్ భూపాలపల్లి జిల్లా

# సైకిల్ దినోత్సవం సందర్భంగా నిర్వాహకులకు సన్మానం

**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** వరంగల్ రామన్నపేటలోని డాక్టర్. ఎ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇద్దరు సైకిల్ రిపేరర్లను సన్మానించారు. గత నాలుగు దశాబ్దాల నుంచి కేవలం సైకిల్ రిపేరింగ్ మీదనే జీవనం సాగిస్తూ, అందరికి ఉపయోగపడుతూ పలువురి మన్ననలను పొందుతూ ఆరోగ్యంలో భాగంగా మరియు జీవనోపాధి కల్పించుకుంటూ పిల్లలను ఉత్తమ చదువులు చదివిస్తూ నిరంతరము శ్రమిస్తున్న నక్క లోకేశ్వర్, చిట్ల సదానందంను ట్రస్ట్‌చే శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా మేనేజ్ ట్రస్టీ డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ ఆధునిక యుగంలో ఈ వయసులో కూడా ఇంకా సైకిల్ రిపేరింగ్ చేస్తూ జీవనోపాధితోపాటు ఆరోగ్య పరిరక్షణ సమకూర్చడం వాతావరణ కాలుష్యం నివారించడంలో వీరి పాత్ర హర్షనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రష్టి డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ తోపాటు ఆర్గనైజర్ శ్రవణ్, మిట్టపల్లి సమ్మయ్య, ఆడెపు రవివర్మ, నల్ల సత్యనారాయణ, రామా శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.



## బాధితులకు 'ముఖ్యమంత్రి సహాయనిధి' అండ

**51 లబ్ధిదారులకు రూ.16.16 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**ఖమ్మం రూరల్, ఏదులాపురం వాసులకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో అందజేత**



**ఖమ్మం, జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 51 మంది లబ్ధిదారులకు రూ. 16,16,500 విలువైన చెక్కులను దయాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. లబ్ధిదారుల్లో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన వారు 30 మంది, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన వారు 21 మంది ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే కాకుండా, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

## వర్షాలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు ఎస్ ఈ శ్రీనివాసచారి**



**ఏన్కూరు జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** భారీ ఈదురు గాలులు, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్ ఈ శ్రీనివాసచారి కోరారు. గురువారం ఆయన ఏన్కూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారీ ఈదురుగాలుల మూలంగా విద్యుత్ స్తంభాలు పడిపోతున్నాయని ,విద్యుత్ తీగలు తెగిపోతున్నాయని, ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వాటి దగ్గరకు వెళ్ళకూడదని అన్నారు. ఇళ్లలోకి నీరు వచ్చిన సమయంలో తడి చేతితో తీగలు ముట్టుకోకూడదని అన్నారు. దుస్తులను ఆరవేసేందుకు ఇనుప తీగలను తొలగించి ప్లాస్టిక్ వైర్లు వాడాలన్నారు. పంటచేలలో రైతులు చూసుకుని జాగ్రత్తగా నడవాలని అన్నారు. ఏన్కూరు నుంచి నాచారం వరకు రోడ్డు వెడల్పు జరుగుతున్నందున అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ,కొత్త లైన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ లు రమేష్, రాములు నాయక్, బద్రూపవర్, ఏడిఈ యాసిన్, ఏ ఈ ఉమాకాంత్ ,కాంట్రాక్టర్ మొగలి శ్రీనివాసరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రూపుల తండాలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా జాటోత్ మోహన్ ఎన్నిక**





**నర్సింహులపేట, జూన్ 4 (పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని రూపుల తండా గ్రామపంచాయతీ సర్పంచ్ లచ్చు నాయక్ పిలుపునిచ్చారు. గురువారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా జాటోత్ మోహన్, ఉపాధ్యక్షుడిగా లకావత్ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా జాటోత్ నగేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను పార్టీ నాయకులు అభినందించి, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. ఈకార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి మహబూబ్ ఖాన్, సమన్వయ కమిటీ అధ్యక్షుడు అల్వాల్ శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు సతీష్ గౌడ్, ఉపసర్పంచ్ కాస యాకయ్య, యూత్ నాయకుడు డోనికెన ఉపేందర్ గౌడ్, దేవేందర్, రవి, రాజు తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

**ఉపాధి కల్పన శాఖ అధికారి ఎన్.మాధవి**



ఖమ్మం, జూన్ 4 (పీపుల్స్ డైరీ) : నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల 6వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎన్.మాధవి తెలిపారు. నేషనల్ మార్ట్ కంపెనీలో ఖమ్మం నగరంలో 40 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహించనుండగా, 27 ఏళ్ల వయస్సు కలిగి ఉన్న 10వ తరగతి అర్హత కలిగిన మహిళ, పురుష అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. ఆసక్తి, అర్హతలు కలిగి ఉన్నవారు ఖమ్మం టీటీడీసీ భవనంలో ఈ నెల 6వ తేదీన ఉదయం 10గంటలకు జరగబోయే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్ల జిరాక్స్ తో హాజరుకావాలని సూచించారు.

# పంట మార్పిడితో రైతుకు అధిక ఆదాయం

- విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- పంట అవశేషాలు కాల్చొద్దని రైతులకు సూచన
- భూ భారతి ద్వారా అర్హులందరికీ పట్టాలు
- గణపురం రిజర్వాయర్ కాలువల మరమ్మతులకు రూ.32 కోట్లుం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ






**గణపురం, జూన్ 04 (పీపుల్స్ డైరీ) :** రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి సాంప్రదాయ పంటలకు బదులుగా అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గణపురం మండలంలోని మైలారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ... ఇటీవల విద్యుత్ ప్రమాదంతో 60 ఎకరాల్లో పంటలు దగ్ధమవడంతో పాటు నలుగురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనను ప్రస్తావించారు. గ్రామసభల్లో విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. చెరువుల మట్టిని రైతులు తమ పొలాలకు తరలించుకునేలా అవకాశం కల్పించాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు, పోషకాలు నశించి నేల సారవంతత తగ్గిపోతుందని, దీని ప్రభావం దిగుబడులపై పడుతుందని రైతులు పంట వ్యర్థాలను దహనం చేయొద్దని కోరారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహజ పద్ధతులను అనుసరించాలని సూచించారు. విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. భూ భారతి కార్యక్రమం ద్వారా అర్హులైన వారందరికీ పట్టాలు అందజేస్తామని చెప్పారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి భారీ ప్రాజెక్టులను చేపడుతున్నామని తెలిపారు. రూ.200 కోట్ల వ్యయంతో 40 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, 60 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.500 కోట్లతో బైపాస్ రోడ్డు, చెల్పూర్ నుంచి గూడెప్పాడు వరకు నాలుగు వరుసల రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గణపురం రిజర్వాయర్ పంట కాలువల మరమ్మతుల కోసం రూ.32 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి**

జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 4, 6, 8, 10 తేదీలలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో వార్డు సభలు, గ్రామసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి మున్సిపాలిటీ వరకు శాఖల వారీగా కార్యాచరణ రూపొందించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా గ్రామసభలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఈఓ రాజేందర్, గణపురం సిఐ కరుణాకర్ రావు, సర్పంచ్ సమ్మయ్య నాయక్, పిఎసిఎస్ చైర్మన్ కుమార్ యాదవ్, వైద్య, విద్యుత్ ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోచాపూర్, లింగాల గ్రామాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



గోవిందరావుపేట, జూన్ 4( పీపుల్స్ డైరీ) తాడ్వాయి మండల పరిధి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడ్వాయి మండల పరిధి పోచాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో బిట్టుపల్లి, ( కొడిశాల ) బంధాల, పోచాపూర్, నర్సాపూర్ పిఎల్,బొల్లెపల్లి గ్రామాల ప్రజలకు శుక్రవారం ఉదయం 9:00 గంటలకు, లింగాల గ్రామంలోని గ్రామపంచాయతీలో ఒడ్డుగూడెం, అల్లి గూడెం, లింగాల, బోటి లింగాల, లవ్వల గ్రామాల ప్రజలకు 10:00 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రజా దర్బార్ కార్యక్ర మానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన తెలియజేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**




**ఖమ్మం, జూన్ 04 (పీపుల్స్ డైరీ) :** ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు విలాస్ దుబే, అమృత గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ శిక్షణ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు ఎన్యుమరేషన్ ఫారాల ముద్రణ, పంపిణీ, ఓటర్ల నుంచి స్వీకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేయడం, డేటా నమోదు, ధృవీకరణ ప్రక్రియలు,తదితర అంశాలపై అధికారులకు శిక్షణ అందించారు. శిక్షణ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులతో మాట్లాడుతూ... జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిన వాటిని, సూపర్వైజర్లు మ్యాపింగ్‌ను మరోసారి క్షుణ్ణంగా ధృవీకరించాలని సూచించారు. 2002 ఎస్ఐఆర్ ఓటర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను తప్పనిసరిగా మ్యాప్ చేసి క్రాస్ వెరిఫికేషన్ నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, రాజకీయ పార్టీలకు అనుబంధం లేని వాలంటీర్లను గుర్తించి వారికి తగిన శిక్షణ అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్ఓ, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

## అమ్మ కోసం బాల్యం త్యాగం..

- తల్లికి పక్షవాతం... వదిలేసిన తండ్రి
- ఎండనకా, వాననకా కోతితో ప్రదర్శనలు
- తల్లిని కాపాడుకునేందుకు బాలుడి పోరాటం

**పీపుల్స్‌డైరీ-దమ్మపేట :** అమ్మ అనారోగ్యంతో మంచాన పడితే పిల్లలు బాధపడటం సహజం. కానీ ఓ బాలుడు మాత్రం తన బాల్యాన్ని, చదువును, భవిష్యత్తును పక్కన పెట్టి తల్లి ప్రాణాలను కాపాడుకోవడానికి చేస్తున్న పోరాటం ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలిస్తోంది.

పక్షవాతంతో బాధపడుతున్న తల్లికి ఆసరాగా నిలవాల్సిన తండ్రి కుటుంబ బాధ్యతలను విస్మరించి ఇంటిని వదిలి వెళ్లిపోయాడు. దీంతో ఆ కుటుంబం ఒక్కసారిగా ఆధారాన్ని కోల్పోయింది. ఇంట్లో సంపాదించే వ్యక్తి లేకపోవడం, తల్లి మంచాన పడిపోవడంతో కుటుంబ భారం మొత్తం చిన్న వయసులోనే కుమారుడి భుజాలపై పడింది.

వయసు చదువుకోవాల్సినది, స్నేహితులతో ఆడుకోవాల్సినది. కానీ ఆ బాలుడి జీవితంలో పాఠశాల గంటల శబ్దం స్థానంలో బిక్షాటన బాధలు చేరాయి. తల్లి వైద్య ఖర్చులు, ఇంటి అవసరాలు తీర్చేందుకు అతడు పాఠశాలకు దూరమై కోతితో కలిసి గ్రామాలు, పట్టణాలు తిరుగుతూ ప్రదర్శనలు ఇస్తున్నాడు. ప్రజలు కనికరంతో ఇచ్చే కొద్దిపాటి విరాళాలే ఆ కుటుంబానికి జీవనాధారంగా మారాయి.

ఎండైనా, వానైనా, ఆకలైనా, అలసటైనా... తల్లి ప్రాణాలు కాపాడాలనే ఒక్క లక్ష్యంతో ఆ బాలుడు ప్రతి రోజు వీధుల్లో తిరుగుతున్నాడు. తాను చదువుకు దూరమవుతున్నాననే బాధ కన్నా, తల్లికి మందులు కొనలేకపోతానేమో అనే భయమే అతడిని ఎక్కువగా వెంటాడుతోంది.

తల్లి కోసం తన బాల్యాన్ని త్యాగం చేసిన ఆ బాలుడి పరిస్థితి స్థానికులను కంటతడి పెట్టిస్తోంది. "ఈ వయసులో పుస్తకాలు పట్టాల్సిన చేతులు భిక్ష అడగాల్సి రావడం చాలా బాధాకరం" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలు స్పందించి ఆ బాలుడిని తిరిగి పాఠశాలలో చేర్పించి, అతని తల్లికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. సరైన సహాయం అందితే ఆ బాలుడి జీవితంలో మళ్లీ వెలుగులు నిండుతాయని, అతని తల్లి కూడా ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మ కోసం తన బాల్యాన్నే పణంగా పెట్టిన ఈ చిన్నారి కథ ప్రతి మనిషి మనసును కదిలిస్తోంది. అతడి కన్నీళ్ల వెనుక దాగి ఉన్న బాధను గుర్తించి సమాజం చేయూతనిస్తే, ఆ కుటుంబానికి కొత్త జీవితం లభించే అవకాశం ఉంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com